22-07-2025
మంగళవారం
మల్కాజిగిరి
jayabherinews
JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 03 | సంచిక : 59 | పేజీలు : 8 | వెల : 5
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి



తెలంగాణలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా యావత్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రధానంగా భారీ వర్షాలు, వ్యవసాయం, ఆరోగ్యం, నీటి పారుదల వ్యవహారాలు, రేషన్ కార్డుల జారీ వంటి అయిదు కీలక అంశాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుంచి ముఖ్యమంత్రి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పరిస్థితులను సమీక్షించి అవసరమైన ఆదేశాలను జారీ చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు కొత్తగూడెం నుంచి మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఖమ్మం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనగా మిగిలిన మంత్రులు ముఖ్యమంత్రితో పాటు సచివాలయం నుంచి పాల్గొన్నారు.

# ప్రజలకంటే ఈ ప్రభుత్వానికి ఏదీ ముఖ్యం కాదు

జయభేరి, హైదరాబాద్ :

ప్రస్తుత సీజన్‌లో కలెక్టర్లు కచ్చితంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కీలకమైన అయిదు విషయాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. కలెక్టర్లు క్షేత్రస్థాయి పర్యటనలకు సంబంధించి రోజూ వారి కార్యాచరణపై నివేదికలు సమర్పించాలని చెప్పారు. అత్యవసర పనుల కోసం ప్రతి కలెక్టర్ కి కోటి రూపాయల నిధులను మంజూరు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. రైతులు, పేద ప్రజల కంటే తమ ప్రభుత్వానికి ఏదీ ముఖ్యం కాదు. ప్రస్తుత సీజన్‌లో ఎవరు నిర్లక్ష్యంగా ఉండొద్దు. నష్టం జరిగితే ఎవరినీ ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకుంటాం. అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి. సీజన్‌లో రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి. వచ్చే రోజుల్లో వర్షాలు కురియనున్న నేపథ్యంలో రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. కొన్ని చోట్ల అంచనాలకు మించిన భారీ వర్షం కురుస్తోంది. ఈ సీజన్‌లో వాతావరణ శాఖ అందించే సూచనలను ప్రజలకు చేరే విధంగా అప్రమత్తం చేయాలి. ఇప్పటి వరకు రాష్ట్రంలో 21 శాతం వర్షపాతం తక్కువగా నమోదైంది. గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. వర్షాల కారణంగా ఎలాంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం వాటిల్లకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. సీజన్‌లో డెంగీతో పాటు సీజనల్ జ్వరాలు, అంటువ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్య శాఖ ఎప్పటికప్పుడు సర్వసన్నద్ధంగా ఉండాలి. ముఖ్యంగా గిరిజన ప్రాంతాలు, ఐటీడీఏ ఏజెన్సీ ఏరియాల్లో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు అవసరమైన చర్యలు ...మిగతాది 2 లో

## మన సైనికులు వందశాతం లక్ష్యాలను సాధించారు



- ఆపరేషన్ సిందూర్ విజయంతో ప్రపంచం దృష్టి మొత్తం మేడిన్ ఇండియా ఆయుధాలపైనే
- ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

జయభేరి, న్యూ డిల్లీ జూలై 21 :

ఆపరేషన్ సిందూర్ తో మన దేశ సైనికుల సత్తా ప్రపంచం మొత్తం చూసిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. నేటి నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం అయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సమావేశాలు ప్రారంభానికి ముందు పార్లమెంట్ ఆవరణలో ప్రధాని మీడియాతో మాట్లాడారు. వర్షాకాల సమావేశాలు ఫలప్రదం కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.ఆపరేషన్ సిందూర్‌లో మన సైనికులు వందశాతం లక్ష్యాలను సాధించినట్లు చెప్పారు. కేవలం 22 నిమిషాల్లోనే ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసినట్లు గుర్తు చేశారు. ఈ ఆపరేషన్‌తో మన సైనిక సామర్థ్యం, గొప్పతనం ప్రపంచం మొత్తం చూసిందన్నారు. ప్రస్తుతం ప్రపంచ ...మిగతాది 2 లో

## పార్లమెంట్ సమావేశాల్లో తీవ్ర గందరగోళం



- ఆపరేషన్ సిందూర్‌పై చర్చించాలని ప్రతిపక్షాలు డిమాండ్
- స్వాతంత్ర్యం తర్వాత ఇలాంటి ఆపరేషన్ జరుగలేదన్న కేంద్రమంత్రి జేపీ నడ్డా

జయభేరి, న్యూ డిల్లీ జూలై 21:

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజునే సమావేశాల్లో తీవ్ర గందరగోళం నెలకొన్నది. ఆపరేషన్ సిందూర్‌పై చర్చించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశారు. ఈ అంశంపై రాజ్యసభలో తీవ్ర గందరగోళం నెలకొంది. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆపరేషన్ సిందూర్, పహల్గాం ఉగ్రదాడి అంశంపై ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టేందుకు ప్రయత్నించారు. అయితే, బీజేపీ జాతీయ అధ్యక్షుడు, సభా నాయకుడు జేపీ నడ్డా గట్టిగానే సమాధానం ఇచ్చారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే రాజ్యసభలో మాట్లాడుతూ పహల్గాం ఉగ్రవాద దాడి నిందితులను ఇంకా పట్టించుకోలేదన్నారు.అంశంపై అన్ని పార్టీలు ఐక్యంగా ప్రభుత్వానికి ...మిగతాది 2 లో



2 లో

## మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు పథకంలో ‘జీరో ఫేర్ టిక్కెట్’

- మహిళలకు ప్రభుత్వం ఇస్తున్న రాయితీ వివరాలతో టిక్కెట్ల జారీ
- రాష్ట్రంలో ఇక పై ఏసీ ఎలక్ట్రానిక్ బస్సులు మాత్రమే కొనుగోలు
- సొంతంగా విద్యుత్ ఉత్పత్తి-చార్జింగ్ స్టేషన్లతోనే స్వయంసమృద్ధి
- ఆగస్ట్ 15 నుంచి పథకం అమలుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం

## అక్కడ ఎకరా కొనాలంటే.. ఇప్పుడు రెండింతలు అమ్మాలి



జయభేరి, మెదక్, జూలై 21 :


తెలంగాణలో కేసీఆర్ పాలనలో ఎకరం అమ్మితే ఏపీలో పది ఎకరాలు కొనే పరిస్థితి ఉండేదని, కానీ రేవంత్ రెడ్డి పాలనలో సీన్ రివర్స్ అయిందని హరీష్ రావు విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే భూముల ధరలు పడిపోయాయని, రైతులు ఎరువుల కోసం చెప్పులు క్యూలో పెట్టే దుస్థితి వచ్చిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో యూరియా కోసం రైతులు ఎప్పుడూ లైన్‌లో నిలబడలేదని గుర్తు చేశారు.కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత తెలంగాణలో ఎకరం అమ్మితే, ఏపీలో పది ఎకరాలు కొనే పరిస్థితి వచ్చిందని.. కానీ రేవంత్ పాలనలో అంతా ఉల్టా అయిందంటూ హరీష్ రావు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే పరిస్థితి ఇలా ఉందంటే.. రేవంత్ రెడ్డి మరో రెండేళ్లు ముఖ్యమంత్రిగా ఉంటే పరిస్థితి ఇంకా దిగజారుతుందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో మళ్లీ పాత రోజులకు తీసుకెళ్లే పరిస్థితి వచ్చిందన్నారు.కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు ఆంధ్రలో మాటలను ...మిగతాది 2 లో

అక్కడ ఎకరా కొనాలంటే.. ఇప్పుడు రెండింతలు అమ్మాలి

## చరిత్ర క్రియేట్ చేసిన హంపి

జయభేరి, విజయవాడ, జూలై 21 :

భారత చెస్ చరిత్రలో ఒక సరికొత్త అధ్యాయం లిఖితమైంది. తెలుగు తేజం, భారత గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి ఫిడే మహిళల ప్రపంచ కప్ సెమీఫైనల్‌కు చేరుకున్న తొలి భారతీయ మహిళగా చరిత్ర సృష్టించారు. జార్జియాలో జరుగుతున్న ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌లో ఆమె తన అద్భుతమైన వ్యూహాలు, పట్టుదలతో దేశానికే గర్వకారణంగా నిలిచింది.క్వార్టర్ ఫైనల్స్‌లో చైనాకు చెందిన యుక్సిన్ సాంగ్‌తో జరిగిన ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో కోనేరు హంపి 1.50.5 పాయింట్ల తేడాతో విజయం సాధించి సెమీస్‌లోకి దూసుకెళ్లింది. మొదటి గేమ్‌లో తెల్లపావులతో అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించి విజయం సాధించిన హంపి, రెండో గేమ్‌లో డ్రా చేసుకుని సెమీస్‌లో తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. ఆమె ప్రతి కదలికలో కనిపించిన అనుభవం, వ్యూహాత్మక ఆలోచన విజయానికి కారణమైంది.కోనేరు హంపి ఈ అద్భుత



విజయం సాధించడంతో దేశవ్యాప్తంగా ఆమెపై ప్రశంసల వర్షం కురుస్తోంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## ఈ ప్రభుత్వానికి ఏదీ ముఖ్యం కాదు

తీసుకోవాలి. పీహెచ్‌సీ, ఏరియా, జిల్లా ఆసుపత్రుల్లో వైద్యులు అందుబాటులో ఉండే విధంగా కలెక్టర్లు పర్యవేక్షించాలి. నీటి పారుదల వ్యవహారాల్లో నీటి నిల్వలను జాగ్రత్తగా అంచనా వేసుకుంటూ ముందుకు సాగాలి. జిల్లాల పరిధిలో సాగునీటి ప్రాజెక్టులు, చెరువులు, కుంటల నీటిని జాగ్రత్తగా ఒడిసిపట్టుకోవాలి. కృష్ణా బేసిన్‌లో ఇప్పటికే కొన్ని ప్రాజెక్టుల కింద నీటి విడుదల మొదలైంది. త్వరలోనే నాగార్జునసాగర్ నీటిని విడుదల చేస్తాం. రాష్ట్రంలో ఎరువులకు కొరత లేదు. ఎరువులు అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలి. ప్రతి డీలర్ వద్ద ఎరువులు ఎంత మేరకు అందుబాటులో ఉన్నాయన్నది స్టాక్ వివరాలను తెలియజేస్తూ షాపు ముందు విధిగా డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేయాలి. ప్రతి షాపు వద్ద పోలీసు, రెవెన్యూ సిబ్బందిని పెట్టి ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించాలి. రాష్ట్రంలో 20, 25 శాతం మేరకు ఎరువులను వ్యవసాయానికి కాకుండా ఇతర రంగాలకు వాడుతున్నట్టు ఇటీవల ఢిల్లీలో కేంద్ర ఎరువులు రసాయన శాఖ మంత్రి నడ్డాని కలిసినప్పుడు చెప్పారు. ఈ విషయంలో అక్రమ రవాణా జరగకుండా నిఘాను అప్రమత్తం చేయాలి. దారి మళ్లించకుండా చూడాలి. వ్యవసాయానికి ఉపయోగించాల్సిన యూరియా లాంటి ఎరువులను వ్యాపార అవసరాలకు ఎవరు మళ్లించినా క్రిమినల్ కేసులు నమోదు చేయండి. రైతులకు నష్టం చేసే పని ఎవరు చేసినా ఉపేక్షించేది లేదు. ఎరువులకు సంబంధించిన సమస్యలేమైనా ఉంటే ఫిర్యాదు చేయడానికి టోల్ ఫ్రీ నంబర్ కేటాయించండి. కొందరు కృత్రిమ కొరతను సృష్టిస్తూ గందరగోళపరుస్తున్నారు. భారీ వర్షాల కారణంగా GHMC పరిధిలో నీటి నిల్వ, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ పరిస్థితులను అధిగమించడానికి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలి. జీహెచ్‌ఎంసీ, పోలీస్, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, HYDRAA ఆధ్వర్యంలోని 150 టీమ్‌లు ఎప్పటికప్పుడు రంగంలో ఉండాలి. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సమన్వయం చేసుకుని ముందస్తుగా బృందాలను సిద్ధం చేసుకోవాలి. మరో కీలకమైన అంశం రేషన్ కార్డులు. రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తుంగతుర్తిలో రేషన్ కార్డుల పంపిణీని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించాం. 7 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తున్నారు. పాత రేషన్ కార్డుల్లో పేర్లు తొలగించడం, కొత్తవారిని చేర్చడంతో సహా కార్యక్రమాలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో మొత్తంగా 96.95 లక్షల రేషన్ కార్డులు ఉండగా, వాటి ద్వారా 3.10 కోట్ల మంది ప్రయోజనం పొందుతున్నారు. గతంలో దొడ్డు బియ్యం పంపిణీ ఉన్నప్పుడు అంత డిమాండు లేదు. సన్నబియ్యం పంపిణీ ప్రారంభించినప్పటి నుంచి రేషన్ కార్డులకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. రేషన్ కార్డుల జారీపై ఈ నెల 25వ తేదీ నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు జిల్లా ఇంచార్జీ మంత్రులు, జిల్లా మంత్రులు అన్ని మండల కేంద్రాల్లో స్థానిక ఎమ్మెల్యేలను భాగస్వామ్యం చేస్తూ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించాలి. ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో కనీసం ఒక మండల కేంద్రంలోనైనా కచ్చితంగా కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించాలి. దాదాపు 15 రోజుల పాటు కార్యక్రమాల కోసం ఒక షెడ్యూలు తయారు చేసుకుని పర్యవేక్షించాలి. 25 నుంచి పక్షం రోజుల పాటు షెడ్యూలు వేసుకుని ప్రత్యేకంగా పాత జిల్లా కేంద్రానికి జిల్లా కలెక్టర్లందరినీ పిలిచి జిల్లా ఇంచార్జి మంత్రి సమావేశం ఏర్పాటు చేసి సమీక్షించాలి. జిల్లా మంత్రి, ఇంచార్జి మంత్రి, కలెక్టర్లతో సమన్వయం చేసుకుని, ప్రతి మండలానికి ఒక అధికారిని ఇంచార్జిగా వేసి పర్యవేక్షించాలి. కీలకమైన అయిదు అంశాలపై ఉమ్మడి జిల్లాలో సమీక్ష నిర్వహించి సరైన మార్గనిర్దేశం చేయాలి.

## వందశాతం లక్ష్యాలను సాధించారు

వ్యాప్తంగా మేడిన్ ఇండియా ఆయుధాల గురించే మాట్లాడుతోందన్నారు. ఉగ్రవాదాన్ని, నక్సలిజాన్ని నిర్మూలించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ప్రధాని పేర్కొన్నారు. 'ఆపరేషన్ సిందూర్' విజయం గురించి మన దేశ ఎంపీలు ప్రపంచంలోని వివిధ దేశాల్లో పర్యటించి వివరించారని మోదీ గుర్తు చేశారు. పాక్ దుష్ట చర్యలను అంతర్జాతీయంగా ఎండగట్టినట్లు చెప్పారు. తుపాకులు, బాంబులు ఉన్నా మన రాజ్యాంగం ముందు నిలబడలేకపోయాయని స్పష్టంచేశారు. ఈ వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో 'ఆపరేషన్ సిందూర్' విజయంపై వేడుక చేసుకోవాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. దేశ ప్రయోజనాల విషయంలో రాజకీయ పార్టీలూ, ప్రతీ ఒక్కరూ ఐక్యతతో ముందుకు సాగాలని సూచించారు .ఈ సందర్భంగా భారత వ్యోమగామి శుభాన్షు శుక్లా అంతరిక్ష యాత్ర గురించి కూడా ప్రధాని మోదీ ప్రస్తావించారు. శుభాన్షు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లి రావడంపై మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఐఎస్ఎస్‌లో మన జాతీయ జెండా ఎగరడం దేశ ప్రజలందరికీ గర్వకారణం అని కొనియాడారు. ఇక రైతుల జీవనోపాధి, దేశ ఆర్థిక వ్యవస్థ వర్షాలపై ఆధారపడి ఉందన్నారు.

## పార్లమెంట్ లో తీవ్ర గందరగోళం

మద్దతు తెలిపాయని, దాడితో పాటు ఆ తర్వాత జరిగిన ఘటనలపై సమాచారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం భద్రత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, దీన్ని లెఫ్టినెంట్ గవర్నర్ స్వయంగా అంగీకరించారని గుర్తు చేశారు. అదే సమయంలో చాలామంది సీనియర్ సైనిక అధికారులు సైతం అనేక విషయాలను వెల్లడించారన్నారు. ప్రభుత్వం ఈ విషయంలో సమాచారం ఇవ్వాలన్నారు.తన మధ్యవర్తిత్వంతోనే కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 24 సార్లు చెప్పారని.. వేరే దేశానికి చెందిన వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దేశానికే అవమానకరమన్నారు. అనంతరం జేపీ నడ్డా మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ గురించి సహా ప్రతి అంశంపై చర్చించిస్తామని.. ప్రతి అంశాన్ని సభ టేబుల్‌పై ఉంచుతామన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇప్పటివరకు ప్రధానమంత్రి నాయకత్వంలో ఆపరేషన్ సిందూర్‌లో జరిగినట్లుగా ఇలాంటి ఆపరేషన్ జరగలేదన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై చర్చ కోసం సభలో నోటీసు ఇచ్చారని.. ప్రభుత్వం చర్చిస్తుందని.. ప్రతి ప్రశ్నలకు సమాధానం ఇస్తామని ఆయన స్పష్టం చేశారు.

## చరిత్ర క్రియేట్ చేసిన హంపి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో సహా చాలామంది ప్రముఖులు హంపికి శుభాకాంక్షలు తెలియజేశారు. "వరల్డ్ కప్ సెమీఫైనల్లో చేరిన తొలి భారతీయ మహిళగా కోనేరు హంపి చరిత్ర సృష్టించింది. ఇది తెలుగు ప్రజలందరికీ గర్వకారణం" అని రేవంత్ రెడ్డి ట్వీట్ చేయగా, చంద్రబాబు నాయుడు "మన తెలుగు కుమార్తె ప్రపంచ వేదికపై కాంతులు విరజిమ్ముతోంది. నీ ఘనత దేశవ్యాప్తంగా మమ్మల్ని గర్వించేలా చేస్తోంది" అని కొనియాడారు.
ఆంధ్రప్రదేశ్‌లోని గుడివాడలో 1987లో జన్మించిన కోనేరు హంపి ఐదు సంవత్సరాల వయసులోనే తన తండ్రి కోనేరు అశోక్ ద్వారా చదరంగం ఆటను నేర్చుకుంది. 2002లో గ్రాండ్ మాస్టర్ టైటిల్ సాధించిన ఆమె, 2019, 2024లో మహిళల ప్రపంచ రాపిడ్ చెస్ ఛాంపియన్‌గా నిలిచింది. అనేక అంతర్జాతీయ టైటిళ్లను గెలుచుకున్న హంపి, భారత మహిళా చెస్‌కు ప్రపంచవ్యాప్తంగా గొప్ప గుర్తింపు తీసుకొచ్చింది. ఇప్పుడు సెమీఫైనల్లో ఆమె విజయంపై దేశమంతా ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

## అక్కడ ఎకరా కొనాలంటే..

గుర్తు చేసిన హరీష్ రావు, ఇప్పటి పాలనపై విమర్శలు చేశారు. ప్రజ్ఞాపూర్ వేదికగా గజ్వేల్ బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి వచ్చి రెండేళ్లు కూడా పూర్తి కాకుండానే తెలంగాణలో సీన్ రివర్స్ అయిందంటూ వ్యంగ్యంగా విమర్శలు చేశారు.సిద్ధిపేట నియోజకవర్గంలోని చిన్నకొండూరు మండలం గంగాపూర్ గ్రామానికి వెళ్లినప్పుడు అక్కడ ప్రజలు తమ బాధలు చెప్పుకొన్నారని, అమ్ముదామంటే కనీసం భూములు కూడా కొనడం లేదని ప్రజలు చెబుతున్నారని హరీష్‌రావు అన్నారు. అప్పట్లో నలభై లక్షల రూపాయలకు భూమి అడిగితే తాము ఇవ్వలేదని, ఇప్పుడు ఇరవై లక్షలకు ఇద్దామన్నా ఎవ్వరూ రావడం లేదని తనతో చెప్పారన్నారు.ప్రస్తుతం ఇరు తెలుగు రాష్ట్రాల్లో సీన్ రివర్స్ అయిందని.. అక్కడ చంద్రబాబు, ఇక్కడ రేవంత్ రెడ్డి రావడంతో భూములు ధరలు మారిపోయాయన్నారు. ఆంధ్రలో ఎకరం అమ్మితే తెలంగాణలో రెండు ఎకరాలు వస్తుందని, రేవంత్ రెడ్డి ఇంకో రెండేళ్లు అధికారంలో ఉంటే ఇంకేమవుతుందో అని హరీష్ ఎద్దేవా చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు కూడా ఇబ్బందులు పడుతున్నారని, ఎరువుల కోసం చెప్పులు లైన్‌లో పెట్టే పరిస్థితి వచ్చిందని హరీష్‌రావు అన్నారు. కేసీఆర్ పాలనలో ఎప్పుడైనా యూరియా కోసం లైన్‌లో నిలబడ్డారా అని ప్రశ్నించారు. కేసీఆర్ గద్దె దిగిన తర్వాత మళ్లీ పాస్ బుక్‌లు, చెప్పులు లైన్‌లో పెట్టే పరిస్థితి దాపురించందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎకరాకు ఒక్క సంచీ మాత్రమే ఇస్తున్నారని, కానీ కేసీఆర్ పాలనలో ఇలాంటి పరిస్థితే లేదని హరీష్‌రావు గుర్తు చేశారు.

# దారి తప్పుతున్న భాష వాదం

**భారతదేశం బహుభాషా సంస్కృతికి నిలయం. ప్రతి భాషకు దానిదైన చరిత్ర, సంస్కృతి, అస్తిత్వం ఉన్నాయి. అయితే, కొన్ని దశాబ్దాలుగా భారతదేశంలో భాషా వివాదాలు, ముఖ్యంగా హిందీని ఇతర భాషలపై రుద్దే ప్రయత్నంపై తలెత్తుతున్న ఆందోళనలు నిత్యకృత్యంగా మారాయి. భాషా వివాదాలు భారతదేశానికి కొత్తేమీ కాదు. అయితే, దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో, ఐక్యత, సమగ్రత అత్యవసరమైన ఈ సమయంలో భాష పేరుతో జరుగుతున్న హింస, విభేదాలు సమాజానికి ఏమాత్రం శ్రేయస్కరం కాదు. ఒక భాషను బలవంతంగా రుద్దే ప్రయత్నం చేయడం వల్ల అది సామాజిక అశాంతికి దారితీస్తుంది.**




భారతదేశంలో భాషా వైవిధ్యాన్ని గౌరవించడం, అన్ని మాతృభాషలకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం అత్యవసరం. విద్యార్థులు తమ మాతృభాషలో ప్రాథమిక విద్యను అభ్యసించడం, ఆ తర్వాత ఇతర భాషలను నేర్చుకోవడానికి ప్రోత్సాహం అందించడం సరైన పద్ధతి. హిందీకి దానిదైన ప్రాధాన్యం ఉండవచ్చు. కానీ, అది ఇతర భాషలపై ఆధిపత్యం చెలాయించే ప్రయత్నం చేయకూడదు. అభివృద్ధి అనేది కేవలం ఒక భాష నేర్చుకోవడం వల్ల మాత్రమే రాదు. అది విద్య, నైపుణ్యాలు, ఆర్థిక అవకాశాలు, సామాజిక సమానత్వం, మౌలిక సదుపాయాలు వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. దేశంలోనే ధనిక రాష్ట్రమైన మహారాష్ట్రలో ప్రస్తుతం భాష, అస్తిత్వం పేరుతో జరుగుతున్న ఆందోళనలు ఈ సమస్య ఎంత లోతుగా పాతుకుపోయిందో స్పష్టం చేస్తున్నాయి. ఒకవైపు ఆర్థికంగా బలంగా ఉన్న రాష్ట్రంలో భాష పేరుతో హింసాత్మక సంఘటనలు జరుగుతుండడం, మరోవైపు రాజకీయ నాయకుల వ్యాఖ్యలు ఈ వివాదానికి మరింత ఆజ్యం పోస్తున్నాయి. మహారాష్ట్రలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో మరాఠీని రాష్ట్ర భాషగా, ఇంగ్లిష్‌ను రెండో భాషగా, హిందీని మూడో భాషగా తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఆదేశాలివ్వడంతో గత ఏప్రిల్ నెల నుంచి ఆందోళనలు తీవ్రమయ్యాయి. ఈ నిర్ణయం సమాఖ్య విధానానికి అనుగుణంగానే తీసుకున్నామని మహారాష్ట్ర ప్రభుత్వం సమర్థించుకుంది. నిజానికి, భారత విద్యావ్యవస్థకు ప్రోత్సాహం, క్రమబద్ధీకరణ లక్ష్యాలతో ప్రభుత్వం 1968లో జాతీయ విద్యావిధానాన్నిఅమల్లోకి తెచ్చింది.
అవసరాన్ని బట్టి దానిని మార్పులు చేస్తోంది. ప్రస్తుతం ఆందోళనలకు కారణమైన త్రిభాషా విధానాన్ని ఐదేండ్ల కిందటే కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీన్ని దశలవారీగా అమలుచేస్తున్నప్పటికీ, ఇది వివాదాస్పదంగా మారి, గతంలోనూ పలు ఆందోళనలకు దారితీసింది. మహారాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సివిల్ సొసైటీ గ్రూపులు, భాషాభిమానులు, ప్రతిపక్ష నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఉత్తర, మధ్య భారత రాష్ట్రాల్లో ప్రధానంగా మాట్లాడే హిందీ భాషను మహారాష్ట్ర ప్రజలపై బలవంతంగా రుద్దేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తున్నారు. స్వాతంత్ర్యం తర్వాత భాషాప్రయుక్త రాష్ట్రాలను ఏర్పాటు చేయడంతో మహారాష్ట్ర సహా చాలా రాష్ట్రాల్లో భాష అన్నది సున్నితమైన అంశంగా మారింది. గత ఏడాది, ఇండియా సిలికాన్ వ్యాలీగా పేరొందిన బెంగళూరులో కన్నడ భాషాభిమానులు ఆందోళనలు నిర్వహించారు. కంపెనీలు, షాపుల పేర్లను కేవలం ఇంగ్లిష్‌లోనే గాకుండా స్థానిక భాషలోనూ రాయాలనేది వారి డిమాండ్. ఈ సంఘటనలు భాషా అస్తిత్వ పోరాటాలు కేవలం మహారాష్ట్రకే పరిమితం కాదని స్పష్టం చేస్తున్నాయి. హిందీకి ప్రోత్సాహంపై అనుమానాలు. భారత్‌లో అత్యధికంగా మాట్లాడే భాష హిందీ. హిందీని ప్రోత్సహించడానికి కొన్నేండ్లుగా వివిధ ప్రభుత్వాలు పలు చర్యలు చేపట్టాయి. ఇది స్థానిక సంస్కృతిని దెబ్బతీస్తుందనే సందేహాలు వెల్లువెత్తాయి. హిందీ భాషను సమాజంపై బలవంతంగా రుద్దుతున్నారనే ఆరోపణలు రావడానికి అనేక కారణాలున్నాయి. మొదటగా, జాతీయ భాష అనే నినాదం. రాజ్యాంగం ప్రకారం భారతదేశానికి జాతీయ భాష అంటూ ఏదీ లేదు. హిందీ కేవలం అధికార భాష మాత్రమే. అయినప్పటికీ, హిందీని జాతీయ భాషగా ప్రచారం చేయాలనే తపన హిందీయేతర రాష్ట్రాలలో ఆందోళన కలిగిస్తోంది. 'ఒకే దేశం ఒకే భాష'. ప్రభుత్వ విధానాలు. కేంద్ర ప్రభుత్వ సంస్థలు, బ్యాంకులు, రైల్వేలు వంటి వాటిలో హిందీ వినియోగాన్ని పెంచడం, హిందీలో శిక్షణను తప్పనిసరి చేయడం, ఉద్యోగాలలో హిందీ పరిజ్ఞానానికి ప్రాధాన్యం ఇవ్వడం వంటి చర్యలు హిందీయేతర ప్రజలకు అసమానతలకు దారితీస్తాయని భావిస్తున్నారు. మూడోది, రాజకీయ ప్రకటనలు.
బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ తరహా ఆందోళనలు పెరిగాయి. హిందీ మాట్లాడే రాష్ట్రాల్లోని బీజేపీకి చెందిన నాయకులు తరచుగా హిందీకి ప్రాధాన్యాన్ని ఇస్తూ చేస్తున్న వ్యాఖ్యలు వివాదాస్పదమవుతున్నాయి. 'ఒకే దేశం ఒకే భాష' అనే నినాదం భారతదేశ వైవిధ్యాన్ని విస్మరిస్తుందనే విమర్శ ఉంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హిందీ భాషను 'పెద్దమ్మ భాష'గా అభివర్ణించడం తీవ్ర చర్చకు దారితీసింది. ఆయన ఈ వ్యాఖ్యలు చేయడానికి కొన్ని కారణాలు ఉండవచ్చు. జాతీయ సమగ్రత దృక్పథం దీని వెనుక ఒక కారణం. భారతదేశంలో ఎక్కువ మంది ప్రజలు మాట్లాడే భాష హిందీ కాబట్టి, దేశవ్యాప్తంగా కమ్యూనికేషన్ కోసం హిందీ అవసరమని ఆయన భావించి ఉండవచ్చు. 'పెద్దమ్మ భాష'అనే పదం భాషకు ఒక గౌరవాన్ని ఆపాదించాలనే ప్రయత్నంగా కనిపించినప్పటికీ, అది ఇతర మాతృభాషల ప్రాముఖ్యాన్ని తగ్గించి చూసేవిధంగా ఉంది. మరాఠీ మాట్లాడనివారిపై దాడులు. ఏప్రిల్ నెలలో థానే జిల్లాకు చెందిన ఇద్దరు మహిళలపై మరాఠీలోనే మాట్లాడాలని పట్టుబట్టిన వ్యక్తి దాడికి పాల్పడటం, ముంబయిలో ఒక సెక్యూరిటీ గార్డుకు మరాఠీ తెలియదన్నందుకు స్థానిక ప్రతిపక్ష పార్టీ మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన (ఎంఎన్ఎస్) కార్యకర్తలు కొట్టారని ఆరోపించడం, మే నెలలో ఓ డెలివరీ ఏజెంట్ మరాఠీలో మాట్లాడలేదని ముంబయిలో ఓ జంట డబ్బులు చెల్లించడానికి నిరాకరించడం, తాజాగా మరాఠీలో మాట్లాడలేదని గత వారం ఓ దుకాణ యజమానిపై ఎంఎన్ఎస్ కార్యకర్తలుగా భావిస్తున్న కొంతమంది దాడి చేయడం వంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి.
ఈ ఆందోళనలు, తదనంతర పరిణామాలతో సామాజిక విభజనలు పెరిగాయి. అదే సమయంలో దాదాపు రెండు దశాబ్దాలుగా రాజకీయ వైరం నెరపిన ఇద్దరు నాయకులు తమ విభేదాలను పక్కనబెట్టి కలిసిపోయారు. వారిలో ఒకరు బాల్ థాకరే కుమారుడు కాగా, మరొకరు ఆయన సోదరుడి కొడుకు. స్థానిక ప్రతిపక్షం శివసేన (యూబీటీ) అధిపతి ఉద్ధవ్ థాకరే, ఎంఎన్ఎస్ పార్టీ నాయకుడు రాజ్ థాకరే హిందీ అమలును వ్యతిరేకిస్తూ గత వారం సంయుక్తంగా ర్యాలీ నిర్వహించడం ఈ భాషా రాజకీయాల తీవ్రతను తెలియజేస్తుంది. భాషా వైవిధ్యాన్ని గౌరవించాలి. పవన్ కల్యాణ్ వంటి నాయకులు భాషా విషయాలపై వ్యాఖ్యలు చేసేటప్పుడు, దాని సామాజిక, రాజకీయ, సాంస్కృతిక కోణాలను పూర్తిగా అవగాహన చేసుకొని మాట్లాడాల్సిన బాధ్యత ఉంది. భాషను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించడం మానేసి, భాషా వైవిధ్యాన్ని దేశ సంపదగా పరిగణించినప్పుడు మాత్రమే భారతదేశం నిజమైన ఐక్యతను, సమగ్రతను, సుస్థిరాభివృద్ధిని సాధించగలదు. త్రిభాషావిధానంపై మహారాష్ట్ర వెనకడుగు. త్రిభాషా విధానంపై మహారాష్ట్రలో ఉద్రిక్తతలు అధికమవ్వడంతో బీజేపీ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం వెనకడుగు వేసింది. తన నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది. ఈ త్రిభాషా విధానంపై పునఃపరిశీలనకు ఒక కమిటీని నియమించింది. కానీ, వివాదం ఇంకా సద్దుమణగలేదు. దేశంలోనే అత్యంత ధనిక నగరపాలక సంస్థ ముంబయి సిటీ సహా మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికలు చాలాకాలంగా వాయిదాపడుతూ వచ్చాయి. వాటి నిర్వహణకు సన్నద్ధమవుతున్న తరుణంలో ఈ భాషాపరమైన వివాదం రేగి, అధికార కూటమికి, ప్రతిపక్ష పార్టీలకు మధ్య రాజకీయ వేడిని రాజేసింది. పొలిటికల్ గేమ్స్ ఆడుతున్నారంటూ ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. ఈ భాషా వివాదం కేవలం రాజకీయ ప్రకటనలకే పరిమితం కాలేదు, హింసాత్మక సంఘటనలకు కూడా దారితీసింది. మరాఠీ మాట్లాడనివారిపై, మరాఠీయేతరులపై దాడులు జరుగుతున్నాయి.

## 'జీరో ఫేర్ టిక్కెట్'

ఆగస్టు 15 నుంచి మహిళలకు అమలు చేయనున్న ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ పథకంలో మహిళలకు 'జీరో ఫేరో టిక్కెట్ ' ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఎక్కడ నుంచి ఎక్కడకు ప్రయాణం చేస్తున్నారు... ఉచిత ప్రయాణంతో ఎంతమేర వారికి డబ్బులు ఆదా అయ్యాయి... 100 శాతం ప్రభుత్వం ఇస్తున్న రాయితీ... వంటి వివరాలు ఆ టిక్కెట్‌లో పొందుపరచాలని చెప్పారు. జీరో ఫేర్ టిక్కెట్ ఇవ్వడం ద్వారా ఎంత లబ్ధిపొందారనే విషయం రాష్ట్రంలోని మహిళా ప్రయాణికులు అందరికీ సులభంగా తెలుస్తుందని ముఖ్యమత్రి అన్నారు. ఇందుకు సంబంధించి సాఫ్ట్‌వేర్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సోమవారం సచివాలయంలో మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ పథకంపై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంతో ఏ ఏ రాష్ట్రాలకు ఆర్థికంగా ఎంత భారం పడింది... మన రాష్ట్రంలో ఎంత వ్యయం కానుందనే అంశాలపై అధికారులతో ముఖ్యమంత్రి చర్చించారు. ఎట్టిపరిస్థితుల్లో పథకాన్ని ఆగస్ట్ 15 నుంచి సమర్ధవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.

**ఆర్టీసీని లాభాల బాట పట్టించండి :**

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం త్వరలో అమలు చేస్తున్నందున ఆర్టీసీకి భారం కాకుండా... ఇతర ఆదాయ మార్గాలు పెంపొందించుకోవడం, నిర్వహణా వ్యయం తగ్గించుకోవడం ద్వారా సంస్థను లాభాల బాట పట్టించాలని ముఖ్యమంత్రి సూచించారు. లాభాల ఆర్జనకు ఎలాంటి మార్గాలున్నాయి.. ఎటువంటి విధానాలు తీసుకురావాలి... అనే దానిపై ఒక కార్యాచరణ రూపొందించాలన్నారు. మరోవైపు రాష్ట్రంలో ఇకపై ఏసీ ఎలక్ట్రానిక్ బస్సులు మాత్రమే కొనుగోలు చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి నిర్దేశించారు. ప్రస్తుతం ఉన్నవాటిని ఎలక్ట్రికల్ బస్సులుగా మారిస్తే నిర్వహణా వ్యయం తగ్గుతుందని... అలాగే ఇందుకు అవసరమయ్యే విద్యుత్‌ను సొంతంగా ఉత్పత్తి చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని ఆర్టీసీ డిపోల్లోనూ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసే అంశంపైనా అధ్యయనం చేయాలని సీఎం స్పష్టం చేశారు.

## భారీ నుంచి అతిభారీ వర్షాలు

✍ **జయభేరి, హైదరాబాద్ జూలై 21 :**

తెలంగాణలో రాగల ఐదురోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో, ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. పశ్చిమ మధ్యవాయువ్య బంగాళాఖాతం, దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర, యానం మీదుగా సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవరణం ఉందని వాతావరణశాఖ పేర్కొంది. అలాగే, తూర్పుపశ్చిమ ద్రోణి దక్షిణ కర్నాటక నుంచి దక్షిణ ఆంధ్ర ప్రదేశ్ వరకు సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతుందని తెలిపింది. ఈ నెల 24 నాటికి ఉత్తర బంగాళాఖాతంలో కొత్తగా అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వివరించింది.ఈ క్రమంలో సోమవారం కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయని చెప్పింది. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్ధిపేట, కామారెడ్డి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే సూచనలున్నాయంటూ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది.ఇక ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురుగాలులతో భారీ వర్షాలు పడుతాయని హెచ్చరించింది. బుధవారం మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో అతిభారీ వర్షాలు.. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, మహబూబాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని వివరించింది. గురు, శుక్రవారాల్లో భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, ఖమ్మం జిల్లాల్లో బలమైన ఈదురు గాలతో కూడిన భారీ వర్షాలు పడేందుకు అవకాశం ఉందని వాతావరణశాఖ వివరించింది.



# విద్యతో పాటు సంస్కారం ఉండాలి

- క్రమశిక్షణకు మారుపేరు నిలవడం సంతోషకరం

**జయభేరి, చర్ల, జూలై 21 :**




చర్ల విద్యతో పాటు సంస్కారం ఎంతో ముఖ్యమని న్యాయవాది పరిటాల సంతోష్ కుమార్ అన్నారు. వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం విద్యార్థి నిలయ విద్యార్థులకు నల్గొండ జిల్లాకు చెందిన న్యాయవాది, తన స్నేహితుడు కొత్తపల్లి శశాంక్ పంపించిన 10 వేల విలువ చేసే 30 స్కూల్ బ్యాగులను సంతోష్ సోమవారం విద్యార్థి నిలయంలో జరిగిన కార్యక్రమంలో పంపిణీ చేసారు. ఈ సందర్భంగా వనవాసీ ప్రఖండ ప్రముఖ్ గొంది శోభన్‌బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో విద్యార్థులను ఉద్దేసించి ప్రసంగించారు. సోమవారం నిలయంలో జరిగిన చదువులతల్లి సరస్వతీదేవి పూజ సందర్భంగా విద్యార్థులకు స్కూల్ బ్యాగులను అందచేయడం సంతోషకరమని అన్నారు. ఇక్కడి విద్యార్థుల క్రమశిక్షణ, వారు పఠించే సంస్కృత శ్లోకాలు అద్భుతమని పేర్కొన్నారు. ఇక్కడి విద్యార్థుల క్రమశిక్షణను ఇతరులు చూసి నేర్చుకోవాలని పేర్కొన్నారు. ఇక్కడి విద్యార్థుల గొప్పతనాన్ని తమ అడ్వకేట్స్ క్లాస్ మెట్స్ వాట్సాఫ్ గ్రూపులో పోస్ట్ చేయడంతో అనేక మంది స్పందించి విద్యార్థులకు సహాయ సహకారాలను అందచేసేందుకు ముందుకు వస్తున్నారని వెల్లడించారు. తాము చదువుకున్న రోజులలో పడ్డ కష్టాలను ఇతరులు అనుభవించకూడదనే ఉద్దేశంతో పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. తాను చెప్పిన ఒక్క మాటతో స్నేహితులు ముందుకు రావడం ఇక్కడి విద్యార్థుల గొప్పతనమేనని స్పష్టం చేసారు. విద్యార్థులు కూడా దాతల నమ్మకాన్ని నిలబెట్టేలా పట్టుదలతో చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. తాను చర్ల నుండి హైకోర్టు లాయర్ గా ఎదిగానంటే దానికి చదువే కారణమన్నారు. దీనిని గుర్తెరిగి ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టిసారించాలని కోరారు. వనవాసీ ప్రాంత మహిళా సహప్రముఖ్ పెద్దాడ ఆశాలత మాట్లాడుతూ విద్యార్థులు దాతలు అందచేసిన సహకారాన్ని సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. పేద విద్యార్థుల చదువులకు పెద్ద ఎత్తున సహకరిస్తున్న దాతలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియచేసారు. కార్యక్రమంలో వనవాసీ నిలయ కమిటీ ఉపాధ్యక్షుడు జవ్వాది మురళీకృష్ణ, కోశాదికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, సభ్యురాలు పోలిన రమాదేవి, నిలయ ప్రముఖ్ గొంది ప్రసన్నకుమారి, విద్యార్థుల తల్లిదండ్రులు ముదరయ్య, ఉంగయ్య, రేగుంట ఆచార్యురాలు కలం జ్యోతి పాల్గొన్నారు.




# ఉత్తమ సెక్రటరీగా సముద్రాల ప్రభాకర్

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ లయన్స్ క్లబ్ లయన్ స్టిక్ ఇయర్ 2024 25 సంవత్సరానికి గాను, ఉత్తమ సెక్రటరీగా సముద్రాల ప్రభాకర్ అవార్డు తీసుకోవడం జరిగింది. సముద్రాల ప్రభాకర్ దేవరకొండ పట్టణ ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి ప్రతి ఒక్కరికి అందరికీ ఎప్పుడు ఏదో ఒక సహాయం చేస్తుండే దాంట్లో ముందుంటాడని ఆర్యవైశ్య సంఘం నాయకులు అవార్డు వచ్చిన సందర్భంగా అభినందనలు తెలియజేసినారు.

# మృతుని కుటుంబానికి బియ్యం అందజేత



**జయభేరి, తుర్కపల్లి, జూలై 21 :**

తుర్కపల్లి మండలం గంధమల్ల గ్రామానికి చెందిన బొత్త వెంకటేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు బొత్త రాములు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన బొందుగుల సత్యనారాయణ మరణించడంతో వారి కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని వారి కుటుంబ సభ్యులు బొందుగుల యాదగిరికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గంధమల కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఉపాధ్యక్షులు శాగరాజు,గడిపే సత్యనారాయణ ,శాగ కనకరాజు, శాగ రామ చందర్, మాడిశెట్టి సురేందర్, ఇటికాల బాల్నర్స్,శాగ మల్లయ్య, గడిపే సత్యనారాయణ, శాగ లింగయ్య, పాల్గొన్నారు.

# తప్పు చేసిన వాళ్లపైనే చర్యలు


**జయభేరి, ఒంగోలు:**

తప్పు చేసిన వాళ్లపైనే చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ఒంగోలులో 4 కోట్ల 80 లక్షలతో నిర్మించిన సబ్ స్టేషన్ ని ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్ , విజయ్ కుమార్ తో కలిసి ఆయన ప్రారంభించారు. ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్తు అందించేందుకు సబ్ స్టేషన్ల సంఖ్య పెంచుతున్నామని వెల్లడించారు.

# నేషనల్ స్టార్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్న చైతన్య మాస్టర్

- టి.చైతన్య మాస్టర్ సినీ హీరో భాను చందర్ చేతుల మీదుగా గౌరవం
- చైతన్య మాస్టర్‌కు నేషనల్ స్టార్ ఎక్సలెన్స్ అవార్డు ఆయుష్ అకాడమీకి గర్వకారణం

**జయభేరి, దేవరకొండ :**



విజయవాడలోని గుజ్జల సరళాదేవి ఫంక్షన్ హాల్ లో నేషనల్ స్టార్ ఎక్సలెన్స్ అవార్డు కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. దేశం నలుమూలల నుండి వచ్చిన మార్షల్ ఆర్ట్స్ మాస్టర్లు, విద్యావేత్తలు, యువ నాయకులు మరియు సేవా రంగంలో ప్రత్యేక కృషి చేసిన వ్యక్తులకు ఈ అవార్డులు ప్రదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటుడు భాను చందర్ ముఖ్య అతిథిగా హాజరై, అవార్డు ప్రదానోత్సవం మరియు నేషనల్ ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ AVను ఆవిష్కరించారు. ఈ గొప్ప కార్యక్రమాన్ని చీఫ్ ఆర్గనైజర్ Sifu. Galla. Rufas Paul ఆధ్వర్యంలో ఎంతో అట్టహాసంగా నిర్వహించడమైంది. ఆయన మార్షల్ ఆర్ట్స్ అభివృద్ధికి చేస్తున్న కృషి ప్రశంసనీయమైనది. ఈ వేడుకలో ప్రత్యేకంగా, T.చైతన్య మాస్టర్ ఫౌండర్ & డైరెక్టర్ AYUSH KARATE ACADEMY OF INDIA కి మార్షల్ ఆర్ట్స్ అభివృద్ధికి చేసిన విశేష సేవలకి గుర్తింపుగా నేషనల్ స్టార్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. ఈ ఘనతకు ఆయన శిష్యులు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎన్నో విభాగాల్లో శ్రమిస్తున్న మాస్టర్లు, యువ ప్రతిభావంతులు నేషనల్ స్టార్ ఎక్సలెన్స్ అవార్డు, షైనింగ్ స్టార్ అవార్డు లు అందుకున్నారు. అవార్డు గ్రహీతలను ప్రేక్షకులు ఉత్సాహంగా అభినందించారు. సినీ హీరో భాను చందర్ మాట్లాడుతూ.. ఇలాంటి అవార్డులు యువతకు పెద్ద ప్రోత్సాహాన్ని ఇస్తాయి. ప్రతిభను గుర్తించి గౌరవించడం గొప్ప విషయం. నేను భాగస్వామ్యం కావడం గర్వంగా భావిస్తున్నాను. అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నవంబర్ 9, 2025 తెలంగాణ రాష్ట్రం, నల్గొండ జిల్లా, దేవరకొండ లో నిర్వహించనున్న నేషనల్ ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ కి సంబంధించిన అధికారిక ప్రకటన మరియు AV ప్రారంభం ఘనంగా జరిగింది. ఈ పోటీకి చీఫ్ ఆర్గనైజర్ తేజవత్ చైతన్య మార్గనిర్దేశకులుగా వ్యవహరిస్తున్నారు. కార్యక్రమం చివర్లో సాంస్కృతిక కార్యక్రమాలు, జ్ఞాపికలు, పలువురు గురువుల నుంచి ప్రేరణాత్మక ప్రసంగాలతో ముగిసింది.

# విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించే విధానాన్ని రద్దు చేయ్యాలి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి డిమాండ్

**జయభేరి, పరవాడ :**




పరవాడ మండలం కేంద్రం అయినా పరవాడ లో సోమవారం ఎంఆర్ఓ ఆఫీస్ జంక్షన్లో గృహనియోగదారులతో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్ల గృహాలకి బిగించవద్దని డిమాండ్ చేశారు. ఇప్పటికే బిగించిన స్మార్ట్ మీటర్ల వలన భారీగా విద్యుత్ బిల్లులు రావడం దుర్మార్గమన్నారు. వెంటనే విద్యుత్ మీటర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. వేసిన విద్యుత్ బిల్లును రద్దు చేయాలని స్మార్ట్ మీటర్ను తొలగించాలని గృహాలకు కూడా విద్యుత్ మీటర్లు స్మార్ట్ మీటర్లు బిగించే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం విద్యుత్ మీటర్లను రద్దు చేస్తామని విద్యుత్ బిల్లులు ఉండవని వాగ్దానం చేసి స్మార్ట్ మీటర్లను ధ్వంసం చేయాలని పిలుపునిచ్చిన నారా లోకేష్ నేడు విద్యుత్ బిల్లులను భారీగా పెంచడం భారీగా బిల్లులు వేయడం దుర్మార్గమన్నారు. వెంటనే స్మార్ట్ మీటర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని, ట్రూ ఆఫ్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు, స్మార్ట్ మీటర్లు బిగించవద్దని, ప్రజలపై విద్యుత్ బారాల ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వి అప్పలరాజు, పి అప్పలనాయుడు, పెంటారావు, తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీ చర్లలో ప్రారంభమైన అడ్మిషన్లు

**జయభేరి, చర్ల, జూలై 21 :**



చర్ల మండలంలో గల కేజీబీవీ పాఠశాల నందు ఆరవ తరగతి నుంచి తొమ్మిదవ తరగతి వరకు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సిఇసి, ఎం పి హెచ్ డబ్ల్యు కోర్సు నందు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ ఆర్ భానుప్రియాంక తెలియజేశారు. అవకాశాన్ని సద్వినియం చేసుకోవాలని కోరారు.

ఇంటర్ మీడియట్ కళాశాలలో బోధించేందుకు ఎకనామిక్స్ పోస్ట్ ఒకటి (అర్థశాస్త్రం) బోధించేందుకు తాత్కాలిక ప్రాతిపదికన ఉపాధ్యాయులుగా 2025 26 సంవత్సరముకు గాను పనిచేయుటకు మహిళ అభ్యర్థుల నుంచి దరఖాస్తు ఆహ్వానిస్తున్నామన్నారు. అర్హత ఎం ఏ ఎకనామిక్స్, బిఈడి లో ప్రావీణ్యం పొంది ఉండవలెను. దరఖాస్తు చేసుకొనుటకు అభ్యర్థులు బయోడేటా తో పాటు సర్టిఫికెట్స్ జతచేసి చర్ల కేజీవీబీ కళాశాల నందు సమర్పించగలన్నారు. అభ్యర్థులను మెరిట్ లిస్టు ఆధారంగానే ఎంపిక జరుగుతుందని, పూర్తి వివరాలు కేజీబీవీ చర్ల కళాశాలలో తెలుసుకోవాలన్నారు.



# జేఎన్ఎంఆర్ కాలనీలో వీధి దీపాలు ఏర్పాటు చెయ్యండి

- జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన మహిళా సంఘం ఐద్వా జిల్లా అధ్యక్షరాలు పి మాణిక్యం

**జయభేరి, పరవాడ:**

అనకాపల్లి జిల్లా పరవాడ మండలం పరవాడ పోలీస్ స్టేషన్ ఎదురకుండా జేఎన్ఎంఆర్ కాలనీ కొత్త బిల్డింగుల్లో వీధిలైట్లు లేక ఆ ప్రజలందరూ ఇబ్బంది పడుతున్నారని తక్షణమే వీధిలైట్స్ వెలిగే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజా సమస్యల పరిస్కార వేదికలో కలెక్టర్ ఫిర్యాదు చేశారు. ఈ ఏరియాలో సుమారు 520 ఇల్లు ఉన్నాయి అని రాత్రి సమయం అయ్యితే ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు అని దీని ఈ ఏరియాలో స్తంభాలయితే వేశారు కానీ లైట్లు కలెక్షన్ బిగించలేదు అని దీని వలన ఇళ్లలలోకి విష జీవులు చేరుతున్నాయని దీని పై సంబందించిన విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని అఖిల భారత ప్రజా తంత్ర మహిళా సంఘం ఐద్వా అనకాపల్లి జిల్లా అధ్యక్షులు పి మాణిక్యం తెలిపారు.

# గుడివాడని మర్యాదపూర్వకంగా కలిసిన వైస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి పైలా



**జయభేరి, పరవాడ:**

వైస్సార్సీపీ రాష్ట్ర పార్టీ కార్యవర్గంలో తనకు చోటు కల్పించునందుకు స్థానిక నాయుకులుతో కలిపి సోమవారం మిందిలో మాజీ మంత్రి,వైస్సార్సీపీ నేత గుడివాడ అమర్నాథ్ ని వైస్సార్సీపీ నాయకుడు పైల శ్రీనివాసరావు కలిసి పుష్పగుచ్చం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర పార్టీ కార్యవర్గంలో తనకు చోటు కలిపించునందుకు మాజీ ముఖ్యమంత్రి,పార్టీ అధ్యక్షులు వైస్ జగన్ మోహన్ రెడ్డికి, మాజీ మంత్రి గుడివాడ అమర్ నాథ్ కి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేసారు . ఈ సందర్భంగా గుడివాడ మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకి, నాయకుడుకి తగిన గుర్తింపు ఉంటుంది అని పార్టీ అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రి వైస్ జగన్ మోహన్ రెడ్డి చెప్పిన మాటకి పైలకి ఇచ్చిన పదవే ఉదాహరణగా చెప్పవచ్చు అని అన్నారు.ఈ సందర్భంగా గుడివాడను కలిసిన వారిలో పరవాడ మండల నాయకుడు,మాజీ సర్పంచ్ చుక్కా రాము నాయుడు,మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు,నాయుకులు పైల అప్పలనాయుడు,బండారు శ్రీనివాస్,పైల హరీష్,వ్రీ హరి,రమణ తదితరులు ఉన్నారు.

# బీఆర్ఎస్ పార్టీ కృషి ధర్నా ఫలితమే రోడ్డు శంకుస్థాపన



**జయభేరి, చర్ల జులై 21 :**

చర్ల బస్టాండ్ నుండి కాలేజీ రోడ్డు అనేక గుంటలతో నిండి పోయిందని, ప్రజలు ఆ రోడ్డు పై ప్రయాణం చేయుటకు అనేక ఇబ్బందులు పడేవారని, బీఆర్ఎస్ పార్టీ మే 23 న ఆ రోడ్డు వెంటనే నిర్మాణం చేపట్టాలని ధర్నా కార్యక్రమం నిర్వహించారని, బీఆర్ఎస్ పార్టీ కృషి పలితమే రోడ్డు శంకుస్థాపన జరిగిందని బీఆర్ఎస్ పార్టీ కన్వీనర్ దొడ్డి తాతారావు తెలియజేశారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తామని అన్నారు. పాత చర్ల గాంధీ బొమ్మ నుండి శివాలయం సి సి రోడ్డు 2 నెలలకె పాడైందని, అధికారుల అలసత్వం అవినీతే కారణమని, ప్రజలు వాపోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# సేవాలాల్ బంజారా సంఘం నాయకులు అభిషేక్ రాథోడ్ జన్మదిన వేడుకలు



**జయభేరి, దేవరకొండ :**

కాల్వపల్లి రాము దాదా దగ్గర సేవలాల్ బంజారా సంఘం నాయకులు అభి రాథోడ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జన సేన పార్టీ నాయకులు సేవలల్ బంజారా సంఘం రాష్ట్ర అధ్యక్షులు బంజారా సినీ హీరో కోర్ర చందు నాయక్ ,బి ఆర్ఎస్ పార్టీ యువ నాయకులు హిమవంతు, శ్రీధర్, బచ్చు నారాయణ, సిద్దు శ్రీనివాస్, సింగర్ మహేష్ తదితరులు పాల్గొని గజమాలతో సత్కరించి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సేవలాల్ బంజారా సంఘం నాయకులు అభిషేక్ బంధుమిత్రులు వివిధ పార్టీ నాయకులు మరియు వివిధ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభాత జయభేరి

# ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పెరిగిన హమాలి రేట్లు

■ పల్లా దేవేందర్ రెడ్డి

జయభేరి, దేవరకొండ :

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో దేవరకొండ లోని సిమెంటు దిగుమతి హమాలి రేట్లు పెంచుకోవడం జరిగిందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి ,జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి తెలిపారు.సోమవారం దేవరకొండ లోని ప్రజా భవన్ లో జరిగిన సిమెంట్ షాప్ ల యాజమాన్యం మరియు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగిన చర్చల్లో పరస్పర అంగీకారము మేరకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హమాలిరేట్లూ పెంచుకోవడం జరిగిందని దేవేందర్ రెడ్డి తెలిపారు. రెండు సంవత్సరాలకొకసారి జరిగే అగ్రిమెంట్లో గత లో ఉన్నటువంటి రేట్లపై 16% ఆధనంగా పెంచుకోవడం జరిగినది అన్నారు. ఎగుమతి దిగుమతి హమాలి రేట్ల తో పాటు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం, సంవత్సరానికి రెండు జతల బట్టలు ఇవ్వాలని తీర్మానించారు. కార్మిక హక్కుల కోసం ఏఐటియుసి అండగా నిలబడి నిరంతరము రాజీలేని సమరశీల పోరాటాలను నిర్వహిస్తుందని అన్నారు. హమాలీ కార్మికులకు సమగ్ర




చట్టం రూపొందించి బీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వానికి కోరారు. ఆసంగటిత రంగ కార్మికుల కు సమగ్ర చట్టం లేకపోవడం వల్ల లక్షలాదీ మంది కార్మికులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తారు. సమస్యల పరిష్కారం కోసం కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ డివిజన్ అధ్యక్షులు నూనె వెంకటేశ్వర్లు, కోశాధికారి జే వెంకట్రాములు,మండల కార్యదర్శి ఏ మల్లయ్య, సిమెంట్ షాప్ యజమానులు మారుపాక సురేష్ గౌడ్, కుంచకూరి ఆనంద్, నీల బాలస్వామి, బూరుగు రవి కుమార్, హమాలి యూనియన్ అధ్యక్షులు నీల వెంకటయ్య, కార్యదర్శి గోదాసి కృష్ణయ్య, దోమల వెంకటయ్య, యాదయ్య,శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ సాయి సన్నిధిలో సరస్వతి అమ్మవారికి వడి బియ్యం మహోత్సవం

జయభేరి, చింతపల్లి :

చింతపల్లి రెండవ షిరిడిగా పేరుగాంచిన శ్రీ సాయి సన్నిధిలో సరస్వతి అమ్మవారి కి ఆషాడమాస సందర్భంగా మల్లెపల్లి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ సభ్యులు అమ్మవారికి వడిబియ్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కొండమల్లేపల్లి వాసవి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమం నిర్వహించినారు.

## అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



జయభేరి, దేవరకొండ :

దేవరకొండ పట్టణంలోని ఎం.కె.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్) 2025-26 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న పోస్టులకు అతిథి అధ్యాపకుల ద్వారా భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా..రమావత్ రవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో 55% మార్కులు ఉన్నవారు అర్హులని తెలిపారు. ఎస్సీ, ఎస్టి అభ్యర్థులకు 50% మార్కులు ఉండాలని పేర్కొన్నారు. పీహెచ్డీ /నెట్ / సెట్, బోధన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఖాళీల వివరాలు తెలుగు -1, ఇంగ్లీష్-1, హిస్టరీ -1, ఎకనామిక్స్-1, పొలిటికల్ సైన్స్-1, కామర్స్-2, కంప్యూటర్ సైన్స్-2, జువాలజీ-1, బోటనీ-1, ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ దరఖాస్తు ఫారాలను కళాశాల కార్యాలయంలో తేదీ 22, సాయంత్రం 4:30 గంటల లోపు అందజేయాలని తెలిపారు. ఇంటర్వ్యూ తేదీ, సమయము, ఇంటర్వ్యూ జరుగు స్థలం వివరాలను అభ్యర్థులకు చరవాణి ద్వారా తెలియజేస్తారని పేర్కొన్నారు. ఇతర వివరాలకు సెల్ : 9989753238, 9000350670 సంప్రదించాలని తెలిపారు.

## కేటీఆర్ కు ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు

■ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్



జయభేరి, ఉప్పల్ :

ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర తొలి ఐటి, మున్సిపల్ శాఖ మంత్రి సిరిసిల్ల నియోజకవర్గం ఎమ్మెల్యే కేటీఆర్ ని నంది నగర్ లోని వారి నివాసంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి షాలువాతో సత్కరించి ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, చిల్కానగర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎదుల కొండల్ రెడ్డి, కోకొండ జగన్, బాణాల నారాయణరెడ్డి, బాలకృష్ణ గౌడ్, జిల్లాల ప్రవీణ్ ముదిరాజ్ మొదలగువారు పాల్గొన్నారు.

## పీఎంసీ శ్రీ సాయినగర్ కాలనీ నూతన అధ్యక్షుడిగా సుదర్శన్ రెడ్డి




జయభేరి, మేడిపల్లి, జూలై 21 :

పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ శ్రీ సాయి నగర్ కాలనీ నూతన అధ్యక్షుడిగా సుదర్శన్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధిలో తన వంతు కృషి చేస్తానని ఎలాంటి సమస్యలను ఉన్న మా కార్యవర్గం దృష్టికి వస్తే తక్షణమే పరిష్కరించే ప్రయత్నం చేస్తామని హామీ ఇస్తున్నాము.

నూతన కార్యవర్గం: అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి ఉపాధ్యక్షులు సురేష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి, సత్యనారాయణ, ట్రెజరర్ బాపురాజు, జాయింట్ సెక్రెటరీ, మనోజ్, రాజు నాయక్, జనార్ధన్ రెడ్డి, సంఘటన కార్యదర్శులు, జయంతి నాయక్, నాగార్జున, మదనచారి, ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు అందరూ పాల్గొని ఎన్నుకున్నారు.

## దేవరకొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం

జయభేరి, దేవరకొండ :



దేవరకొండ పట్టణంలోని పి పి ఆర్ కన్వెన్షన్ హాల్లో జరిగిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో శాసన సభ్యులు నేనావత్ బాలునాయక్ తో పాటు కాంగ్రెస్ పార్టీ నల్లగొండ జిల్లా ఇన్చార్జి ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ నియోజకవర్గ అన్ని మండల పార్టీ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ జెడ్పిటిసిలు, ఎంపీపీలు మరియు ముఖ్య కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు బాలు నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల ప్రకారం ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం, వరి ధాన్యం క్వింటాలు కి 500 రూపాయల బోనస్, రైతు రుణమాఫీ, రైతు భరోసా లాంటి వివిధ పథకాలు ఇప్పటికే ప్రజలకు అందించామని ఇంకా మరిన్ని కార్యక్రమాలు చేస్తుందని తెలియజేశారు. అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ ఏ అభ్యర్థిని ఎంపిక చేస్తుందో అందరూ కలిసి ఆ అభ్యర్థిని గెలిపించే బాధ్యత ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ కార్యకర్త పైన ఉందని అన్నారు. అవకాశాలు రాని నాయకులకు ఏదో ఒక విధంగా కాంగ్రెస్ పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందని, ప్రతి కార్యకర్తను కాపాడుకునే బాధ్యత నా పైన ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామ పంచాయతీల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటుబ్యాంకు రాజకీయాలే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యంగా మారాయి

■ కాంగ్రెస్ పార్టీ నాయకులు దేశ ప్రజలను, తెలంగాణ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు
■ రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిని కలవనివ్వకపోవడం తెలంగాణ ప్రజలను అవమానపరిచినట్లే..
■ బీసీలకు 42% రిజర్వేషన్ల విషయంలో కేంద్రంపై నిందలు వేయడం అన్యాయం
■ బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు



జయభేరి, న్యూ ఢిల్లీ జూలై 21:

ఓటుబ్యాంకు రాజకీయాలే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యంగా మారాయని,కాంగ్రెస్ పార్టీ నాయకులు దేశ ప్రజలను, తెలంగాణ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు విమర్శించారు.సోమవారం డిల్లీ లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిని కలవనివ్వకపోవడం తెలంగాణ ప్రజలను అవమానపరిచినట్లేనని, బీసీలకు 42% రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంపై నిందలు వేయడం అన్యాయ మన్నారు.ఒకవైపు పార్లమెంటులో జరుగుతున్న అనేక అంశాలపై చర్చ జరుగుతుంటే..ప్రధాన ప్రతిపక్ష నాయకుడే గాయబ్ అవుతున్న పరిస్థితి. అటువంటి వారు బిజెపి మీద విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత 19 నెలల్లో ఢిల్లీకి మొత్తం 46 సార్లు వెళ్లారు. ఆ సమయంలో రాహుల్ గాంధీ, ఇతర కాంగ్రెస్ కీలక నేతలు ఆయనకు ఒక్కసారి కూడా అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు. కాని మన ప్రధాని మోదీ గారు, కేంద్రమంత్రులు మాత్రం అపాయింట్‌మెంట్ ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42% రిజర్వేషన్లు కల్పిస్తామని అసెంబ్లీలో బిల్లు తీసుకొచ్చారు. ఈ బిల్లుకు బిజెపి సంపూర్ణ మద్దతు ఇచ్చింది.కానీ ఆర్డినెన్స్ రాకముందే, అందులో 10% ముస్లిం మైనారిటీలకు రిజర్వేషన్లు ఇవ్వాలని కుట్ర చేయడం బాధాకరం. బిజెపి మతపరమైన, రాజకీయపరమైన రిజర్వేషన్లకు పూర్తిగా వ్యతిరేకంగా ఉంటుంది.బీసీలకు 42% రిజర్వేషన్ ఇవ్వాలంటే,రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. అయితే కేబినెట్ లో చర్చ చేసినప్పుడు న్యాయ సలహాలు తీసుకున్నారా లేదా అన్నది అనుమానం కలుగుతోందన్నారు..42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలంటే సుప్రీంకోర్టు ఇచ్చినటువంటి 50 శాతం క్యాప్ మించుతుంది.బీసీ రిజర్వేషన్ శాతం పెంచాలంటే రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 285 లో సవరణ చేయాల్సిన బాధ్యత ఉంటుంది.బీసీ రిజర్వేషన్ శాతం పెంచాలంటే,పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 285లో సవరణ చేయాల్సిన అవసరం ఉంటుంది.ఇప్పుడు బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురావాలని చూస్తోంది. అసలు మీకు 9వ షెడ్యూల్ లో పంపించేటువంటి ప్రక్రియ మీకు తెలుసా? మీకు న్యాయసలహాదారులు చెప్పలేదా? అని ప్రశ్నించారు.ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురావాలని చూస్తోంది. అసలు 9వ షెడ్యూల్‌లో చేర్చే ప్రక్రియ కాంగ్రెస్ పార్టీకి తెలుసా? మీ న్యాయ సలహాదారులు ఏమన్నారు?1973లో కేశవనంద భారతీ కేసులో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.. 9వ షెడ్యూల్‌లో చేర్చినా, ఆ చట్టం జ్యుడిషియల్ రివ్యూకు లోబడి ఉంటుంది.జయలలిత గారు తమిళనాడులో చేసిన రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చినా, అది ఇప్పటికీ కోర్టులో పెండింగ్‌లో ఉంది. ఇంకా తుది నిర్ణయం రాలేదు.తమిళనాడులో జయలలిత గారు రిజర్వేషన్ల విషయంలో ప్రయత్నం చేశారు. అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు మైనారిటీ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఆ రిజర్వేషన్ల చట్టాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చించారు. కానీ దానికి ఏమైంది? ఇప్పటికీ ఆ కేసు సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉంది. తుది తీర్పు రాలేదు.కాబట్టి 42% బీసీ రిజర్వేషన్ కోసం 9వ షెడ్యూల్‌ను చూపిస్తూ మళ్లీ మళ్లీ ప్రజలను మభ్యపెట్టడం సబబుకాదన్నారు..2006 I.R. కోహ్లీ కేసులో కూడా సుప్రీంకోర్టు ఇదే పునరుద్ఘాటించింది. కేశవనంద కేసులో 9వ షెడ్యూల్‌కి సంబంధించి పేర్కొన్న అబ్జెక్షన్లు ఇంకా వర్తిస్తాయని పేర్కొంది. ఈ విషయాలు కాంగ్రెస్ ప్రభుత్వంలోని కేబినెట్‌కు, న్యాయసలహాదారులకు తెలియకపోవడం విచారకరం.కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ సమాజాన్ని తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తోంది. బీసీలను మోసం చేసినందుకు, దగా చేసినందుకు కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని రామచంద్ర రావు డిమాండ్ చేసారు.. కాంగ్రెస్ నాయకులు సుప్రీంకోర్టు తీర్పు తెలుసు, సెక్షన్ 285లో సవరణ అవసరం అన్నది తెలుసు.. అయినా ఎందుకు అసలు చర్చించట్లేదు? కేంద్ర ప్రభుత్వంపై నిందలు వేయడం ద్వారా తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్న కాంగ్రెస్ పార్టీకి... ఈ అంశంలో న్యాయపరమైన సమస్యలు ఉన్నాయని వారికి తెలిసే ఉంటుంది. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఈ విషయంలో న్యాయపరమైన చిక్కులు ఉన్నాయని తెలిసీ కూడా, పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 285 లో సవరణ చేయాల్సిన అవసరం ఉందని తెలిసీ ఈ అంశంపై కాంగ్రెస్ నాయకులు చర్చించకుండా, అసలు సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు బీసీల రిజర్వేషన్ల విషయంలో తప్పుదోవ పట్టిస్తూ రాజకీయ ప్రయోజనాల కోసం నాటకం ఆడుతున్నారు. ఓటుబ్యాంకు రాజకీయాలే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యంగా మారాయి.కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లపై బిల్లు తీసుకొచ్చినప్పుడు బీజేపీ మద్దతు ఇచ్చింది.ఇప్పటికైనా కేంద్రంపై నిందలు వేయకుండా, 42% రిజర్వేషన్లను తాము హామీ ఇచ్చినట్లుగానే అమలు చేయాలి. మతపరమైన రిజర్వేషన్ల విషయంలో మాత్రం బీజేపీ స్పష్టంగా వ్యతిరేకంగా ఉంటుంది. కేవలం స్థానిక సంస్థల ఎన్నికలు జరగకుండా ఉండటానికే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నాటకాలు చేస్తోందని విమర్శించారు..బీసీలకు 42% రిజర్వేషన్ల అంశంపై అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టినప్పుడు 9వ షెడ్యూల్ విషయమై ఎందుకు చర్చించలేదు?మధ్యప్రదేశ్‌లో 50% పైగా రిజర్వేషన్లు అమలయ్యాయి. ఆ విధానాలను కాంగ్రెస్ అధ్యయనం చేయాలి.కాంగ్రెస్ పార్టీ 42 శాతం బీసీ రిజర్వేషన్ల అంశంపై.. ఆర్డినెన్స్‌లో ఏమి పొందుపరిచారో ప్రజలకు ఎందుకు తెలియజేయలేదు?పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 285 ప్రకారం రిజర్వేషన్ల కోసం శాసనసభలో సవరణ చేయాలి.మరి ఎందుకు చేయలేదు?హైకోర్టు చివాట్లు పెట్టేంతవరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్డినెన్స్‌పై ఆలోచించలేదు. ఇది బాధాకరం. మా పార్టీలో ఎవరికైనా క్రమశిక్షణ లేకుంటే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.



## అంగరంగ వైభవంగా ఫలహారం బండి ఊరేగింపులు

జయభేరి, ఎల్బీనగర్ :

మన ప్రియతమ ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డితో కలిసి, బోనాల పండుగ సందర్భంగా, మన మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని వీకర్ సెక్షన్ కాలనీలో జెనిగె అఖిల్ యాదవ్ ఆధ్వర్యంలో సహారా ఎస్టేట్స్ లో సహారా ఎస్టేట్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమాలలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో మన డివిజన్ సీనియర్ నాయకులు, నాయకులు, కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘం వారు, కాలనీ వాసులు, యువత, భక్తులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే



జయభేరి, ఇబ్రహీంపట్నం :

ఇబ్రహీంపట్నం మండలం నెర్రపల్లి, పోచారం, వెలిమినేడు గ్రామాలలో సోమవారం ఉదయం పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలలో పాల్గొని అనంతరం ఏర్పాటు చేసిన సమావేశలాలో పాల్గొన్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లు చిలుక మధుసూదన్ రెడ్డి, కంబాలపల్లి గురునాథ్ రెడ్డి, వైస్ చైర్మన్ మంఖాల కరుణాకర్, Pacs చైర్మన్ పాండురంగారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు జడల రవీందర్ రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పలువురు సీనియర్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.




మేడ్చల్ నియోజవర్గం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లోని శ్రీశ్రీశ్రీ మహంకాళి అమ్మవారి బోనాల పండుగ సందర్భంగా జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో పలారం బండి ఊరేగింపులు ముఖ్యాతిథిగా మేడ్చల్ నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ విచ్చేసి పూజలు నిర్వహించారు.

జయభేరి, మేడ్చల్

# టెక్నాలజీతో నెంబర్ వన్ గా మారిన అహ్మదాబాద్ సిటీ

**జయభేరి, గాంధీనగర్, జూలై 21:**

గుజరాత్‌లోని అహ్మదాబాద్ దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరంగా అవతరించింది. స్వచ్ఛ సర్వేక్షన్ 202425 ర్యాంకింగ్స్‌లో మొదటి స్థానంలో నిలిచింది. పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా చెత్త సేకరణ, వ్యర్థాల ప్రాసెసింగ్, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఆ నగరం అనేక చర్యలు తీసుకుంటోంది. వరదలను నివారించడానికి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తూ, రియల్ టైమ్ పర్యవేక్షణ చేస్తోంది. అయితే హైదరాబాద్‌ను మాత్రం వరదల సమస్య పట్టిపీడిస్తోంది. జాతి పిత మహాత్మా గాంధీ పరిశుభ్రతకు చాలా ప్రాధాన్యత ఇచ్చేవారు. పొలిటికల్ ఫ్రీడమ్ కంటే పరిశుభ్రతే ముఖ్యం అని ఆయన చెప్పారు. పారిశుద్ధ్యం లేకుండా కేవలం రాజకీయ శక్తి ఏం చేయలేదని అన్నారు. అయితే మహాత్ముని మాటలే అక్షరాలా పాటిస్తూ..దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరంగా అవతరించింది గుజరాత్‌లోని అహ్మదాబాద్. పది లక్షల కన్నా జనాభా ఎక్కువ ఉన్న పెద్ద నాగరాల్లోకెల్లా.. క్లీనెస్ట్ సిటీగా నిలిచింది. స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాంకింగ్‌లు ప్రారంభమైనప్పటి నుంచి.. తన ర్యాంక్‌ను మెరుగుపరుచుకుంటూ వస్తోందీ సిటీ.పరిశుభ్రత విషయంలో మేటిగా ఉన్నా.. ఈ నగరాన్ని వరదలు వేధిస్తున్నాయి. ఇప్పుడు ఈ నగరం ఫ్లడ్ మేనేజ్‌మెంట్‌పై ఫోకస్ పెట్టింది. ఈ నేపథ్యంలో నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి అహ్మదాబాద్ మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? ఎలా అమలు చేస్తున్నారు? వరదల నివారణకు అహ్మదాబాద్ ఏం చేస్తోంది? చిన్న వర్షానికే రోడ్లు నదులుగా మారే హైదరాబాద్.. దాన్నుంచి ఏం నేర్చుకోవచ్చు అనే విషయాలు ఇప్పుడు తెలుసుకుందాం.స్వచ్ఛ సర్వేక్షన్ 2024 25 జాబితాలో టాప్‌లో నిలిచిన అహ్మదాబాద్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అవార్డు బహూకరించారు. భోపాల్, లఖ్‌నవూ.. తర్వాతి స్థానంలో ఉన్నాయి. ఇక ఇండోర్, సూరత్, నవీ ముంబై వంటి సిటీలు సూపర్ స్వచ్ఛ్ లీగ్ గ్రూప్‌లోకి వెళ్లగా.. హైదరాబాద్ ఆరో స్థానంలో నిలిచింది. కంటోన్మెంట్ బోర్డు ర్యాంకుల్లో.. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు తొలి స్థానంలో నిలిచి రికార్డు క్రియేట్ చేసింది. అయితే ఈ లిస్ట్‌లో అహ్మదాబాద్‌కు మొదటి స్థానం ఊరికే రాలేదు. దాని కోసం అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చాలా శ్రమించింది. అనేక చర్యలు చిత్తశుద్ధితో అమలు చేసింది.అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రతిరోజు 20 లక్షల గృహాలు, 5 లక్షల కమర్షియల్ ప్రాపర్టీల నుంచి చెత్త సేకరిస్తోంది. ఇందుకోసం జీపీఎస్ ఉన్న 1,850 పైగా వాహనాలు ఉపయోగిస్తోంది. 4800 మంది రాత్రి రోడ్లు ఊడ్చే పారిశుద్ధ్య కార్మికులతో సహా మొత్తం 9000 మంది, 56 మెకానికల్ రోడ్ స్వీపింగ్ మెషీన్లు ప్రతిరోజు 1500 కిలో మీటర్ల రోడ్లను ఊడుస్తున్నాయి. నగరంలో 43,000 పాయింట్లను గుర్తించి.. టార్గెటెడ్ మెయింటేనెన్స్ చేస్తున్నారు.తెలంగాణలో ఇంతకుముందు చేసినట్లే తడి చెత్త, పొడి చెత్త వేరు చేయాలని విస్తృతంగా ప్రచారం కల్పిస్తున్నారు. రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ అనే RRR సూత్రాల ఆధారంగా చెత్త నిర్వహణ చేస్తున్నారు. నగర సాలిడ్ వేస్ట్‌ను 100 శాతం ప్రాసెస్ చేస్తున్నారు. 'మై థైలీ' (పాత దుస్తుల నుంచి క్యారీ బ్యాగ్‌లు తయారు చేయడం) వంటి వాటిలో ప్రజలను భాగస్వామ్యం చేస్తున్నారు.రెగ్యులర్‌గా మెయింటేన్ చేసే పబ్లిక్ టాయిలెట్లను నగరవ్యాప్తంగా ఏర్పాటు చేశారు. 250 పైగా టాయిలెట్లను రెనోవేట్ చేశారు. మహిళల కోసం పింక్ టాయిలెట్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. చెత్త కుండీలను ఏర్పాటు చేశారు. డ్రైనేజీ, పైపులైన్ వ్యవస్థలను అప్‌గ్రేడ్ చేశారు. వేస్ట్ టూ ఆర్ట్ అనే ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు.పిరానా డంప్‌యార్డ్‌లో పేరుకుపోయిన 12.5 మిలియన్ మెట్రిక్ టన్నుల చెత్తను మొత్తం ప్రాసెస్ చేశారు. బయోరీమీడియేషన్ పద్ధతిలో తొలగించి.. దాన్ని రెఫ్యూజ్ డెరైవ్డ్ ఫ్యూయెల్ రీసైకిల్ చేయలేని సాలిడ్ వేస్ట్‌ను ప్రాసెస్ చేస్తే వచ్చే ఇంధనం), ఇనర్ట్ మెటీరియల్‌గా (సాధారణ పరిస్థితుల్లో ఇతర పదార్థాలతో రియాక్షన్ కానివి, మట్టిలో అంత త్వరగా కలిసిపోనివి) మార్చారు.రోజుకు 1,000 మెట్రిక్ టన్నుల చెత్తను ప్రాసెస్ చేసే సామర్థ్యంతో ఏర్పాటు చేసిన వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్.. 15 మెగా వాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తోంది. ఇక పొడి చెత్తను నిర్వహించేందుకు 9 మెటీరియల్ రికవరీ ప్లాంట్లను మహిళను ఆపరేట్ చేస్తున్నారు.నగరంలోని గోడలపై అందమైన కళారూపాలను వేస్తున్నారు. అలాగే చారిత్రక వారసత్వ కట్టడాలు, ప్రాంతాల వద్ద, పబ్లిక్ ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉండేటట్లు చర్యలు చేపడుతున్నారు.పరిశుభ్రత నిబంధనలు పాటించని వారికి జరిమానాలతో బుద్ధి చెబుతోంది అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్. ఇప్పటివరకు ఫైన్ల రూపంలో రూ.12 కోట్లు వసూలు చేసిందంటేనే.. ఎంత పకడ్బందీగా నిబంధనలు అమలు చేస్తోందో తెలుసుకోవచ్చు.చెత్త నిర్వహణ సమర్థంగా చేయడానికి ఏఎంసీ టెక్నాలజీని ఉపయోగించుకుంటోంది. చెత్త కుండీలు, చెత్త సేకరించే వాహనాలకు జీపీఎస్, రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ ట్యాగ్‌లు జతచేశారు. దీని ద్వారా వేస్ట్ కలెక్షన్ రూట్లు, వాహనాల కదలికలు, చెత్త నిర్వహణ సమర్థతను.. సెంట్రల్ కంట్రోల్ రూమ్‌తో పర్యవేక్షిస్తున్నారు. ఇక చెత్త సేకరణ, ట్రాన్స్‌పోర్టేషన్‌ను పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ పద్ధతిలో నిర్వహిస్తున్నారు. కాంట్రాక్టర్లకు సరైన సమయంలో ఏఎంసీ పేమెంట్లు చేస్తోందని తెలుస్తోంది. దానివల్ల జవాబుదారీ తనం ఉంటోందని సమాచారం. ప్రజల ఫిర్యాదులను కూడా ట్రాక్ చేసి, పరిష్కరిస్తున్నారు.స్వచ్ఛ్ సర్వేక్షణ్‌లో వరదల నిర్వహణను కూడా పరోక్షంగా పరిగణలోకి తీసుకుంటారు. అర్బన్ వాటర్, సానిటేషన్ మౌలిక వసతులు సరిగా ఉన్నాయా లేవా అని కూడా లెక్కిస్తారు. అయితే వరదలను నియంత్రించడంలో అహ్మదాబాద్ కూడా చాలా సవాళ్లు ఎదుర్కొంటోంది. నగరంలో మూడింట్లో ఒకవంతు మాత్రమే డ్రైనేజీ నెట్వర్క్ ఉంది. కానీ, హైదరాబాద్‌తో పోలిస్తే అహ్మదాబాద్ మెరుగైన చర్యలు తీసుకుంటోంది.ఆ 14 గ్రామాల్లో ఇద్దరు సర్పంచ్‌లు, రెండు రాష్ట్రాల స్కీమ్‌లు.. తెలంగాణ, మహారాష్ట్ర మధ్య పంచాయితీ తెగేదెలా? ప్రజల కోరిక ఏంటి ?వరదలను అంచనా వేయడానికి 25 ఆటోమెటిక్ రెయిన్ గేజ్‌లను అహ్మదాబాద్ మోహరించింది. 19 కంట్రోల్ రూమ్‌లు, 2500 సీసీటీవీ కెమెరాలతో రియల్‌టైమ్ పర్యవేక్షణ, ప్రతిస్పందనలను చూసుకుంటోంది. నగరవ్యాప్తంగా ఇంకుడు గుంతలను నిర్మిస్తోంది. దీనివల్ల వరద రిస్క్ తగ్గడమే కాకుండా భూగర్భ జలాలు కూడా పెరుగుతాయి. ఇక లొకేషన్ స్పెసిఫిక్ వరద నిర్వహణ మోడల్స్ అభివృద్ధి చేయడానికి ఐఐటీ గాంధీనగర్, యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జ్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది.మరోవైపు, హైదరాబాద్‌లోనూ వరద సమస్య తీవ్రంగా ఉంది. చిన్న వర్షం పడితేనే రోడ్లు జలమయం అవుతున్నాయి. గచ్చిబౌలి లాంటి ప్రాంతాల్లో కూడా రోడ్లు నదుల్లా మారాయి. నాలాలు, చెరువులు ఆక్రమణకు గురవడం, సరైన డ్రైనేజీ నిర్వహణ లేకపోవడంతో పరిస్థితి మరింత దిగజారింది. చిన్న వర్షానికే రోడ్లపై పొంగిపొర్లే డ్రైనేజీలు చూస్తే.. సిటీ డ్రైనేజీ వ్యవస్థ ఏ తీరున ఉందో చెబుతోంది. రోడ్లే కాదు, ఆఖరికి ఫ్లైఓవర్లు కూడా నదుల్ని తలపిస్తున్నాయంటే.. వరద నిర్వహణ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.భారత్‌లో వేగంగా అభివృద్ధి చెందుతున్న అర్బన్ ప్రాంతాలు పరిశుభ్రతతో పాటు వరద నిర్వహణపై కూడా శ్రద్ధ పెట్టాలి. ఇక దాదాపు 10 లక్షల కంటే ఎక్కువ జనాభా కలిగిన అహ్మదాబాద్, హైదరాబాద్ లాంటి నగరాలు మరింత దృష్టి సారించాలి. పరిశుభ్రత, వరద నిర్వహణ వంటి విషయాల్లో అహ్మదాబాద్, సూరత్, ఇండోర్ వంటి నగరాలు తీసుకుంటున్న చర్యలను అధ్యయనం చేసి.. వాటిని హైదరాబాద్‌కు ఉపయోగపడేలా మలచుకోవాలి. అప్పుడే సుందర, సురక్షిత భాగ్యనగరం సాకారం అవుతుంది.






## రూ.2కే చొక్కా...

**జయభేరి, మెదక్, జూలై 21:**

ఒకప్పుడు బట్టలు, ఇతర వస్తువులు ఏవైనా కొనాలంటే.. పది షాపులు తిరిగేవారు.. లేదంటే ఓ పది మందిని ఆరా తీసి.. మంచి షాపులు ఎక్కడున్నాయో తెలుసుకుని షాపింగ్‌కు వెళ్లేవారు. మరి ఇప్పుడో.. అంతా రేటింగ్ మాయ. కర్చీఫ్ నుంచి కంచి పట్టు చీర వరకు ఏం కొనాలన్నా.. ఆన్‌లైన్‌లోనే. ఇక్కడ కస్టమర్ పరిగణలోకి తీసుకునేది రేటింగ్. దాని ఆధారంగానే కొనుగోలు చేస్తారు. ఇప్పుడు ఓ అడుగు ముందుకు వేసి ఇన్‌స్టా ఖాతాలను ఫాలో అవుతూ షాపింగ్ చేస్తున్నారుదుస్తులు లేకుండా మహిళల మృతదేహాలు.. స్కూల్ పిల్లలు కూడా.. 'ధర్మస్థల' కేసు ఏంటి? ఎవరిని కాపాడాలని చూస్తున్నారు?నేటి కాలంలో చాలా మంది ఇన్‌స్టాగ్రామ్‌ను వాడుతున్నారు. ఏమాత్రం సమయం చిక్కినా ఇన్‌స్టా రూల్స్ చూస్తూ సమయం గడుపుతుంటారు. యువతలో ఇన్‌స్టాకున్న క్రేజ్‌ను వాడుకుని.. తమ బిజినెస్‌లు ప్రచారం చేసుకుంటున్నారు కొందరు వ్యాపారులు. ఇన్‌స్టాలో బాగా ప్రచారం చేసుకునేది బట్టల వ్యాపారం.. ఆ తర్వాత ఆభరణాలు. బట్టల విషయానికి వస్తే.. ఫలానా చోట రూ.125లకే బ్రాండెడ్ షర్ట్, రూ.1000కే మూడు షర్ట్స్ అంటూ రీల్స్ తెగ వైరల్ అవుతుంటాయి.పైగా వీటిల్లో చూపించే బట్టలు చూస్తే.. కొనకుండా ఉండటం కష్టం. రీల్స్ చూసి షాపు దగ్గరకి పరిగెత్తితే.. అసలు మోసం అప్పుడు వెలుగులోకి వస్తుంది. తాజాగా ఈ తరహా మోసం ఒకటి వెలుగులోకి వచ్చింది. రూ.2లకే షర్ట్ అంటూ ప్రచారం చేశారు. తీరా షాపు దగ్గరకి వెళ్తే.. పోలీసులు వచ్చి అక్కడి నుంచి తరిమేశారు. మరి ఇంతకు ఏం జరిగిందంటే..ప్రస్తుతం చాలా మంది యువతను లక్ష్యంగా చేసుకుని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా తమ వ్యాపారాలను ప్రమోట్ చేసుకుంటున్నారు. ఈక్రమంలో మెదక్ జిల్లాలోని నర్సాపూర్‌లో ఉన్న చేతన్ మేన్స్‌వేర్ బట్టల షాపు యజమాని కూడా ఇలానే ఇన్‌స్టా వేదికగా కేవలం 2 రూపాయలకే షర్ట్ అంటూ ప్రకటించారు. నేడు అనగా సోమవారం ఉదయం 11 గంటల నుంచి 11 గంటల 10 నిమిషాల వరకు మాత్రమే ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందని ప్రచారం చేసుకున్నాడు. 2 రూపాయలకే షర్ట్ అంటే జనాలు ఊరుకుంటారా.. షాప్ దగ్గరకు ఎగబడ్డారు. 2 రూపాయలకే షర్ట్ వస్తుందనే ఆశతో చాలా మంది యువకులు సోమవారం ఉదయం చేతన్ షాపు వద్దకు చేరుకున్నారు. భారీగా యువకులు రావడంతో తోపులాట చోటు చేసుకుంది. ఇంత మంది యువకులను చూసి చేతన్ షాప్ ఓనర్ భయపడ్డాడు. షాప్ బంద్ చేసి.. అక్కడ నుంచి పరారయ్యాడు. కానీ యువకులు మాత్రం వారికి 2 రూపాయలకే షర్ట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అక్కడే ఉన్నారు. విషయం తెలుకున్న పోలీసులు షాప్ వద్దకు వచ్చి యువకులను చెదరగొట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న నర్సాపూర్ పోలీసులు.. షాప్ ఓనర్ చేతన్ కోసం గాలిస్తున్నారు. ఇలాంటి ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని అంటున్నారు. అలానే షాపు యజమానులు ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తే.. వారి మీద కఠిన చర్యలు తీసుకుంటాని పోలీసులు తెలుపుతున్నారు.

## క్లాట్ డేట్ వచ్చేసింది




**జయభేరి, హైదరాబాద్, జూలై 21:**

దేశవ్యాప్తంగా ఉన్న జాతీయ న్యాయ యూనివర్సిటీల్లో 202526 విద్యా సంవత్సరానికి సంబంధించి అండర్ గ్రాడ్యుయేట్ (UG), పోస్టు గ్రాడ్యుయేట్ (PG) లా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్) 2026 ప్రవేశ పరీక్ష తేదీ విడుదలైంది. ఈ పరీక్ష షెడ్యూల్‌ను తాజాగా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఇందులో వచ్చిన ర్యాంకు ఆధారంగా దేశ వ్యాప్తంగా ఉన్న మొత్తం 24 నేషనల్ లా వర్సిటీల్లో ప్రవేశాలు కల్పిస్తారు. తాజా షెడ్యూల్ ప్రకారం క్లాట్ 2025 పరీక్ష డిసెంబర్ 7వ తేదీన మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరగనుంది. ఈ పరీక్షకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆగస్టు 1 నుంచి ప్రారంభంకానున్నాయి. దరఖాస్తులకు చివరి తేదీగా అక్టోబరు 31ని నిర్ణయించారు.కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్)లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ, ఏడాది ఎల్ఎల్ఎం (యూజీ, పీజీ, డిగ్రీ) ప్రోగ్రాముల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఇతర వివరాలు అధికారిక వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోవచ్చు.

ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ యూనివర్సిటీలో డిప్లొమా కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు కీలక అప్‌డేట్ జారీ చేసింది. వెబ్ ఆప్షన్ల నమోదుకు తుది గడువును పెంపొందిస్తూ ప్రకటన జారీ చేసింది. తాజా ప్రకటన మేరకు తుది గడువు జులై 25 వరకు పొడిగించినట్లు వర్సిటీ రిజిస్ట్రార్ జి రామచంద్రరావు ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతిలోని వ్యవసాయ కాలేజీలోనూ అగ్రికల్చర్ డిప్లొమా కోర్సులో ప్రవేశాలు పొందేందుకు వెబ్ ఆప్షన్లలో అవకాశం కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని అన్నారు. ఇతర వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోవాలని తెలిపారు.

## గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా అమరావతి

**జయభేరి, విజయవాడ, జూలై21:**

2030 నాటికి ఏపీని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా మార్చేందుకు అవసరమైన కార్యాచరణ ప్రకటించారు ఏపీ సీఎం చంద్రబాబు గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో దేశానికే ఆదర్శంగా నిలవాలని 'గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ అమరావతి డిక్లరేషన్'ను సోమవారం నాడు విడుదల చేశారు. సీఎం క్యాంపు కార్యాలయంలో చీఫ్ సెక్రటరీ విజయానంద్, నెడ్ క్యాప్ ఎండి కమలాకర్ బాబు సమక్షంలో చంద్రబాబు గ్రీన్ హైడ్రోజన్ డిక్లరేషన్ విడుదల చేశారు. ఇటీవల అమరావతిలో గ్రీన్ హైడ్రోజన్‌పై రెండు రోజుల పాటు సమ్మిట్ నిర్వహించారు. అమరావతిలో జరిగిన సమ్మిట్‌లో 600 మంది ప్రతినిధులు, ఇండస్ట్రీ రంగ నిపుణులు పాల్గొన్నారు. 7 సెషన్స్‌గా జరిగిన సమ్మిట్‌లో పాల్గొన్న గ్రీన్ హైడ్రోజన్ కంపెనీల సీఈఓలు, సీఓఓలు, ఎండిలు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు జరిగిన సమ్మిట్‌లో చర్చించిన అంశాల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం డిక్లరేషన్ ప్రకటించింది. భారత్‌లో స్వచ్ఛమైన ఇంధనాల ఉత్పత్తి, గ్రీన్ హైడ్రోజన్ మాన్యుఫ్యాక్చరింగ్‌కు విధివిధానాలు రూపొందించేలా డిక్లరేషన్ ప్రకటించారు. ఏపీలో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి అనుకూల పరిస్థితులు కల్పించాలాని లక్ష్యంగా కూటమి సర్కార్ అడుగులు వేస్తోంది.గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి దేశంలోనే అతిపెద్ద ఎకో సిస్టంను ఏపీలో నెలకొల్పటమే డిక్లరేషన్ ప్రధాన ఉద్దేశ్యం. 2027 నాటికి 2 గిగావాట్లు, 2029కి 5 గిగావాట్ల ఎలక్ట్రోలైజర్ల తయారీ లక్ష్యంగా పెట్టుకుంది. 2029 నాటికి ఏడాదికి 1.5 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయనున్నారు. కిలో హైడ్రోజన్ గ్యాస్ రూ.460 నుంచి రూ.160కి తగ్గించేలా పరిశోధనలు, కార్యాచరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. 2029 నాటికి 25 గిగావాట్ల రెన్యువబుల్ ఎనర్జీ పంపిణీకి ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేయాలని డిక్లరేషన్ లో పేర్కొన్నారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్‌గా దీన్ని తీర్చిదిద్దాలని డిక్లరేషన్‌లో నిర్ణయం తీసుకున్నారు. సరికొత్త గ్రీన్ ఎనర్జీ ఆవిష్కరణలు, పరిశోధనల కోసం రూ.500 కోట్లు వ్యయం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. గ్రీన్ హైడ్రోజన్ దిశగా కృషి చేసే 50 స్టార్టప్‌లకు ప్రోత్సాహం కల్పించాలని తాజా డిక్లరేషన్‌లో ప్రకటించారు.

## ఓయమీర్ పెళ్లి కబురు..!

- కోయ భాషలో పెళ్లి పత్రిక
- ఆవిష్కరించిన ఐటీడీఏ పీవో

**జయభేరి, భద్రాద్రి కొత్తగూడెం:**

కోయ భాషలో పెళ్లి పత్రిక వచ్చేసింది. ఇప్పటివరకు లుగులో శుభ లేఖలు వేసుకున్న ఆదివాసీలు ఇక తమ వాడుక భాష అక్షర రూపం దాల్చడంతో నూతన సరళికి శ్రీకారం చుట్టారు. ఆదివాసీ వాడుక భాషను లిపి రూపంలో తీసుకొచ్చే ప్రయత్నం చేసిన భద్రాచలం ఐ.టి.డి. పి ఓ సఫలీకృతమైందని చెప్పొచ్చు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పాల్వంచ గ్రామానికి చెందిన కన్న రాజు అనే ఆదివాసి యువకుడికి భద్రాచలం జగదీష్ కాలనీకి చెందిన పూనే లక్ష్మీ శరణ్యతో ఆగస్టు 3న వివాహం ముహూర్తం ఖరారు చేశారు.ఈ క్రమంలో వీరి వివాహ వేడుక సంబంధించి కళ్యాణ ఆహ్వాన పత్రికను పూర్తిగా కోయ భాషలో ముద్రించారు. ఈ కళ్యాణ ఆహ్వాన పత్రిక చూడముచ్చటగా ఉంది.పందీర్ ముహూర్తం, పెళ్లి మూర్తం, మా సొంత నార్,కబూర్, కరంగానూర్ ఇయాల్ అంటూ...కోయ భాషలో శుభ ఘడియలు,వేదిక,విందు, ఆహ్వానించువారు ఈ పదాలను పొందుపరిచి భళా..ఆదివాసీ శుభ కళ్యాణ పత్రిక అనేలా రూపొందించారు. కళ్యాణ పత్రిక పై భాగాన భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి రాహుల్ ఐఏఎస్ ప్రేరణతో 'కోయ భాషలో పెళ్లి శుభలేఖ అంటూ ముద్రించి పి.ఓ పై తమ అభిమానాన్ని చాటుకున్నారు. సోమవారం ఈ ఆహ్వాన పత్రికను భద్రాచలం ఐటీడీఏ పీవో ఛాంబర్ లో పిఓ రాహుల్ ఐఏఎస్ ఆవిష్కరించారు. కోయ భాష దినోత్సవం రోజునే కోయ భాషలో ఉన్న ఈ ఆహ్వాన పెళ్లి పత్రికను ఆవిష్కరించడం గమనార్హం.

ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో రాహుల్ మాట్లాడుతూ... కోయ భాషలో ఉన్న పెళ్లి పత్రికను చూడటం ఆనందకరంగా ఉందన్నారు. గిరిజనుల మాతృభాషలో లిపి అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. ఇందుకోసం భద్రాచలం ఐటిడిఏ ఎంతగానో చర్యలు తీసుకుందన్నారు. అంతరించిపోతున్న ఆదివాసి గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు భవిష్యత్తు తరాలకు అందించే ప్రయత్నంలో భాగంగానే భద్రాచలంలో ట్రైబల్ మ్యూజియం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆదివాసీల సంస్కృతిపై ప్రత్యేక అధ్యయనం చేసి ఆదివాసి తెగల ఇలవేల్పుల చరిత్రను సేకరిస్తున్నామన్నారు. నేటితరం గిరిజన బాలబాలికలకు, యువతి యువకులకు వారి భాష పై మక్కువ కలిగేలా ఐటీడీఏ ద్వారా నిర్వహిస్తున్న స్వాతంత్ర దినోత్సవ వేడుక, గణతంత్ర దినోత్సవం వేడుక, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాల సందర్భంగా అందించే ఆహ్వాన పత్రికలు, ప్రభుత్వ ఉద్యోగులకు అందించే ప్రశంసా పత్రాలు కోయ భాషలోనే ముద్రించి పంపిణీ చేయడం జరిగిందని పిఓ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఐటీడీఏ పరిపాలన అధికారి సున్నం రాంబాబు మరియు గిరిజన మహిళలు, పురుషులు తదితరులు పాల్గొన్నారు.

## దుబాయ్ లో వరకట్న వేధింపులు

- పుట్టిన రోజు నాడే ఆత్మహత్య

**జయభేరి, తిరువనంతపురం:**



విదేశాల్లో వరకట్న వేధింపులు కొనసాగుతుండగా, కేరళకు చెందిన అతుల్య శేఖర్ అనే మరో మహిళ షార్జాలోని తన నివాసంలో అనుమానాస్పదంగా మృతి చెందడం కలకలం రేపుతోంది. ఆమె 30వ పుట్టినరోజునే, కొత్త ఉద్యోగంలో చేరిన రోజే మరణించడం విషాదం నింపింది. భర్త సతీష్ వరకట్నం కోసం వేధించాడని అతుల్య తల్లి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అతుల్య ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని ఆమె తండ్రి ఆరోపిస్తున్నారు.విదేశాల్లోనూ వరకట్న వేధింపులు ఆందోళనకు గురిచేస్తున్నాయి. తాజాగా, భారత్‌కు చెందిన మరో మహిళ వరకట్న దాహానికి బలైంది. అతుల్య శేఖర్ అనే కేరళ మహిళ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని షార్జాలో తన నివాసంలో శనివారం తెల్లవారుజామున విగతజీవిగా కనిపించడం తీవ్ర కలకలం రేపుతోంది. ఈ ఘటనలో ఆమె భర్త సతీష్‌పై కేరళ పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. గల్ఫ్ న్యూస్ తెలిపిన వివరాల ప్రకారం.. తన 30వ పుట్టిన రోజు నాడే అతుల్య మృతిచెందడం అత్యంత బాధాకరం. అంతేకాదు, ఆమె కొత్త ఉద్యోగంలో చేరిన మొదటి రోజే ఇలా జరిగింది. రోల్లా ప్రాంతంలోని తన ఫ్లాట్‌లో అతుల్య విగతజీవిగాపడి ఉండటాన్ని ఆమె సోదరి, బావ గుర్తించారు.

ఈ ఘటనకు కొద్ది రోజుల ముందే కేరళకు చెందిన ఓ వివాహిత, తన 16 నెలల పాపను చంపి తర్వాత ఆమె కూడా ఆత్మహత్య చేసుకున్న ఘటన షార్జాలోనే చోటుచేసుకుంది. అతుల్య భర్త సతీష్‌పై ఆమె తల్లి కేరళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జులై 18, 19 మధ్య తన కుమార్తెను గొంతునులిపి ఊపిరాడకుండా చేసిన సతీష్. కడుపుపై కాలితో తన్ని, తలపై ప్లేట్‌తో కొట్టాడని ఆరోపించారు. ఇదే తన కుమార్తె మృతికి కారణమైందని ఆమె ఆరోపణలు గుప్పించారు. కుటుంబ సభ్యులు వెల్లడించిన సమాచారం ప్రకారం.. 2014లో అతుల్య, శేఖర్‌లకు వివాహం జరగ్గా.. పదేళ్ల పాప ఉంది. పెళ్లైనప్పప్పటి నుంచి అథుల్యను అదనపుకట్నం కోసం వేధిస్తున్నారని తెలిపారు. పెళ్లి సమయంలో బైక్, 43 సవర్ల బంగారం ఇచ్చినప్పటికీ మరింత డబ్బు ఇవ్వలేదని వేధించారని చెప్పారు.

భారత్‌లోనే కాదు విదేశాల్లోనూ వరకట్న వేధింపులతో భారతీయ మహిళలు ఆత్మహత్యకు పాల్పడటం కలవరానికి గురిచేస్తోంది. ఇటీవల యూపీలో అత్తింటి వేధింపులతో ఓ వివాహిత ఒంటిపై సూసైడ్ నోట్ రాసుకుని ఆత్మహత్య చేసుకుంది.ఈ ఘటనపై బీఎన్ఎస్, 1961 వరకట్న నిషేధ చట్టం తదితర సెక్షన్ల కింద కేసులు నమోదు అయ్యాయి. అయితే, తనపై వచ్చిన ఆరోపణలను ఆమె భర్త సతీశ్ ఖండించారు. 'ఆమె ఆత్మహత్యకు పాల్పడిందంటే నాకే నమ్మబుద్ధి కావడం లేదు. నన్ను జైలుకు పంపడానికి కుట్ర చేస్తున్నారు.. నిజాలు వెలుగులోకి రావాల్సిందే' అని అన్నారు. పెళ్లి సమయంలో భారీగా బంగారం, డబ్బు ముట్టజెప్పినా.. అది సరిపోదని ఇంకా కావాలని అత్తింటివాళ్లు వేధింపులకు గురిచేస్తోన్న ఘటనలు సర్వసాధారణం అయిపోయాయి.అతుల్య తండ్రి మాత్రం తన కుమార్తె ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదన్నారు. ఆమె మరణం కూడా అనుమానాస్పదంగా ఉందని, గతంలోనూ వేధింపులు ఎదుర్కొందని, పోలీసులకు ఫిర్యాదు చేశామని అన్నారు. అతుల్య గాయాలతో ఉన్న దృశ్యాలు, భర్త ఒక ప్లాస్టిక్ స్టూల్‌తో ఆమెను కొట్టేందుకు ప్రయత్నిస్తున్న వీడియోలను కూడా కుటుంబం విడుదల చేసింది.




## వరుణ్‌తేజ్ హారర్ కామెడీ హంగామా

వరుణ్‌తేజ్ కథానాయకుడిగా హారర్ కామెడీ కథాంశంతో ఓ సినిమా రూపొందుతున్న విషయం తెలిసిందే. 'VT 15' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ సినిమా తెరకెక్కుతున్నది. ఇండియన్, కొరియన్ బ్యాక్‌డ్రాప్‌లో ఓ యూనిక్ కాన్సెప్ట్ తో రూపొందుతున్న ఈ చిత్రానికి మేర్లపాక గాంధీ దర్శకుడు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్‌ఫ్రేమ్ ఎంటర్‌టైన్మెంట్ సంస్థలు కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నది. త్వరలోనే టైటిల్‌ను, ఫస్ట్ గ్లింప్స్‌ని విడుదల చేయనున్నట్టు సోమవారం ఓ ప్రకటన ద్వారా మేకర్స్ తెలియజేశారు.

వరుణ్‌తేజ్ కెరీర్‌లోనే ఇది స్పెషల్ మూవీ అని, ఇందులో ఆయన పాత్ర విభిన్నంగా ఉంటుందని, ఇప్పటికే ఇండియాతో పాటు విదేశాల్లో మూడు మేజర్ షెడ్యూల్స్ పూర్తి చేశామని, త్వరలోనే సినిమాను విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. తమన్ సంగీత దర్శకత్వంలో ఇప్పటికే రెండు పాటల రికార్డింగ్ పూర్తయిందని, 'తొలిప్రేమ' తర్వాత వరుణ్‌తేజ్, తమన్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా ఇదేనని మేకర్స్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. రితికా నాయక్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో సత్య కీలక పాత్ర పోషిస్తున్నారు.

## 'కాంతార చాప్టర్1' షూటింగ్ పూర్తి



కన్నడ చిత్రం 'కాంతార' దేశవ్యాప్తంగా సంచలన విజయం సాధించింది. దక్షిణ కన్నడ సంస్కృతి, ఆధ్యాత్మికతలకు అద్దం పడుతూ డివోషనల్ థ్రిల్లర్‌గా మెప్పించింది. చిత్ర హీరో, దర్శకుడు రిషబ్‌శెట్టికి పాన్ ఇండియ స్థాయిలో తిరుగులేని గుర్తింపును తెచ్చిపెట్టింది. ఇప్పుడీ చిత్రానికి 'కాంతార చాప్టర్ 1' పేరుతో ప్రీక్వెల్ తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. కాంతారకు ముందు జరిగిన కథ ఇది. హోంబలే ఫిల్మ్స్ నిర్మిస్తున్నది. ఈ సినిమా షూటింగ్ పూర్తయినట్లు సోమవారం మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా మేకింగ్ వీడియోను విడుదల చేశారు. దాదాపు మూడు సంవత్సరాల పాటు 250 వర్కింగ్‌డేస్‌లో షూటింగ్‌ను పూర్తి చేశామని మేకర్స్ తెలిపారు. ఆద్యంతం ఆధ్యాత్మికతను ప్రతిబింబిస్తూ భారీ సెట్స్, విభిన్న ప్రదేశాల్లో చిత్రీకరణకు సంబంధించిన విశేషాలతో మేకింగ్ వీడియో ఆకట్టుకుంది. అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది.



## రెండు సార్లు విడాకులు..

ఇండస్ట్రీలో చాలా కొంతమంది ఆర్టిస్ట్ లు చిన్న వయసులోనే పెళ్లి చేసుకున్న వారు ఉన్నారు. అలాగే పెళ్లైన తర్వాత కూడా హీరోయిన్స్ గా రాణిస్తున్న వారు ఉన్నారు. ఇక పెళ్ళైన తర్వాత విడాకులు తీసుకున్న వారు కూడా ఉన్నారు. ఇక ఇప్పుడు మనం చెప్పుకుంటుంటున్న హీరోయిన్ కు ఏకంగా రెండు సార్లు విడాకులు అయ్యాయి. 18ఏళ్లకే పెళ్లైంది.. 20 ఏళ్లకే తల్లైంది ఆతర్వాత రెండు సార్లు విడాకులు తీసుకుంది. ఇంతకూ ఆమె ఎవరంటే.. పై ఫొటోలో కనిపిస్తున్న హీరోయిన్ ఎవరో కాదు బాలీవుడ్ బ్యూటీ శ్వేతా తివారి. హిందీలో ఈ అమ్మడు చాలా ఫేమస్. 2000లో 'ఆనే వాలా పల్' సీరియల్ ద్వారా నటిగా పరిచయమైంది ఈ ముద్దుగుమ్మ. బాలీవుడ్ లో ఈ అమ్మడు సినిమాలు, సీరియల్స్ చేసి పాపులర్ అయ్యింది. కాగా ఈ అమ్మడి కి 18 ఏళ్లకే వివాహం జరిగింది. ఆతర్వాత 20 ఏళ్లకే బిడ్డకు జన్మినిచ్చింది. ఆతర్వాత భర్తతో విడిపోయింది. మరొక నటుడిని పెళ్లాడింది. అతనితో ఓ బిడ్డకు జన్మినిచ్చింది. కానీ ఆతర్వాత అతనితోనూ విడిపోయింది. శ్వేతా తివారి 1998లో నటుడు రాజా చౌదరిని వివాహం చేసుకొని తొమ్మిదేళ్ల తర్వాత 2007లో విడాకుల తీసుకుంది. వారికి 8 అక్టోబర్ 2000న కుమార్తె పాలక్ తివారీ జన్మించింది. ఆ తరువాత నటుడు అభినవ్ కోహ్లీ తో మూడు సంవత్సరాల పాటు డేటింగ్ చేసి ఆతర్వాత 13 జూలై 2013న ఆయనను వివాహం చేసుకొని 2016 నవంబర్ 27న మగబిడ్డకు జన్మనిచ్చింది. తివారీ, కోహ్లీలు 2019లో విడిపోయారు. జీవితంలో అనేక సమస్యలుఎదుర్కొన్న శ్వేతా తివారి ఇప్పుడు సినిమాల్లో తనదైన ముద్ర వేసింది.

## అందాలు ఫుల్లు అవకాశాలు నిల్లు.



సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే ముద్దుగుమ్మల్లో దివి ఒకరు. బిగ్ బాస్ ద్వారా విపరీతమైన క్రేజ్ తెచ్చుకుంది వయ్యారి భామ దివి. బిగ్ బాస్ కంటే ముందు దివి కొన్ని సినిమాల్లో చిన్న చిన్న పాత్రల్లో నటించి మెప్పించింది ఈ అందాల తార. సూపర్ స్టార్ మహేష్ బాబు నటించిన మహర్షి సినిమాలో నటించి ఆకట్టుకుంది. ఈ సినిమాతోనే దివి ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. మహర్షి సినిమాలో మహేష్ బాబు ఫ్రెండ్ గా నటించి ఆకట్టుకుంది. ఇక బిగ్ బాస్ హౌస్ లో తన అందాలతో పాటు ఆటతోనూ మెప్పించింది ఈ ముద్దుగుమ్మ. ఇక బిగ్ బాస్ హౌస్ లో స్ట్రాంగ్ కంటెస్టెంట్ గా రాణించింది ఈ చిన్నది. ఇక బిగ్ బాస్ నుంచి బయటకు వచ్చిన తర్వాత వరుస అవకాశాలు వస్తాయని అంతా అనుకున్నారు. కానీ అలా జరగలేదు. కానీ ఈ బ్యూటీ ఒకటి రెండు సినిమాల్లో అవకాశాలు అందుకుంది. ఇక సోషల్ మీడియాలో ఓ రేంజ్ లో అందాలతో ఆరబోస్తుంది ఈ చిన్నది. బిగ్ బాస్ నుంచి బయటకు వచ్చిన తర్వాత దివికి ఆశించిన స్థాయిలో అవకాశాలు అందుకోలేదు. మెగాస్టార్ గాడ్ ఫాదర్ సినిమాలో నటించింది. ఆతర్వాత అవకాశాలు రాలేదు కానీ ప్రైవేట్ సాంగ్స్ తో ప్రేక్షకులను అలరిస్తోంది దివి. అలాగే సోషల్ మీడియాలోనూ ఈ చిన్నది చాలా యాక్టివ్ గా ఉంటుంది. తాజాగా దివి షేర్ చేసిన ఫొటోలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. అందాలు ఆరబోస్తూనే ఫొటోలకు ఫోజులిచ్చింది. ఈ ఫొటోల పై నెటిజన్స్ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. ఈ అమ్మడి ఫొటోల పై మీరూ ఓ లుక్కేయండి.

## బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసు..

### రానా, ప్రకాష్ రాజ్, మంచు లక్ష్మీలకు నోటీసులు



బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసు.. వదల బొమ్మాళి వదల అంటూ టాలీవుడ్‌ను వెంటాడుతోంది. దీనిలో భాగంగా విచారణకు రావాలంటూ.. దగ్గుబాటి రానా, ప్రకాష్‌రాజ్, మంచులక్ష్మికి తాజాగా ఈడీ నోటీసులు జారీ చేసింది. మరోవైపు మనీలాండరింగ్ మేటర్‌లో గూగుల్, మెటాలపై ఈడీ కొరడా ఝుళిపించింది. బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్, మనీ లాండరింగ్ వ్యవహారాలకు సంబంధించిన దర్యాప్తును ఈడీ అధికారులు స్పీడప్ చేశారు. ఇప్పటికే పలువురు సెలబ్రిటీలకు నోటీసులు జారీ చేసిన ఈడీ, తాజాగా టెక్ దిగ్గజాలు గూగుల్, మెటాలకు కూడా సమన్లు పంపింది. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ కేసులో గూగుల్, మెటాలను విచారించనుంది ఈడీ. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్, షేర్‌చాట్, స్నాప్‌చాట్ ఇలా ఏ యాప్ ట్రెండింగ్‌లో ఉంటే.. అందులో బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేశారు సెలబ్రిటీలు. ఈ క్రమంలో విచారణలో భాగంగా గూగుల్, మెటాకు ఈడీ అధికారులు నోటీసులు జారీ చేశారు.

**టాలీవుడ్ నటీనటులకు నోటీసులు**

ఇక బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసుకు సంబంధించి విచారణకు హాజరు కావాలని టాలీవుడ్ ప్రముఖ నటీనటులకు ఈడీ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 23న విచారణకు రావాలని దగ్గుబాటి రానాను ఆదేశించింది. ఈ నెల 30న విచారణకు హాజరు కావాలని ప్రకాష్‌రాజ్‌కు, ఆగస్టు 13న ఎంక్వైరీకి రావాలని మంచులక్ష్మికి నోటీసులు జారీ చేసింది. బెట్టింగ్ యాప్‌లతో జరిగిన అగ్రిమెంట్లు, బ్యాంక్ ఖాతాల వివరాలు తీసుకుని రావాలని టాలీవుడ్ సెలబ్రిటీలను ఆదేశించింది. ఇక ఇదే కేసులో పేర్లున్న మిగతా నటీనటులకు సైతం దశలవారీగా సమన్లు జారీ చేయనున్నట్లు ఈడీ వర్గాలు తెలిపాయి. ఈ వ్యవహారంలో మొత్తం 29 మంది నటీనటులతో పాటు కంటెంట్ క్రియేటర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సలర్లపై విచారణ జరుగుతోంది. ఆన్‌లైన్ బెట్టింగ్‌పై పంజాగుట్ట, మియాపూర్, సైబరాబాద్, విశాఖపట్నంలో పోలీసులు నమోదు చేసిన FIRల ఆధారంగా ఈడీ రంగంలోకి దిగి విచారిస్తోంది.


Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. **Cell: 9391 544 889. RNI No: TGTEL/25/A0314.** email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com